

అబ్బో.. ఎంత పెద్ద నౌక!

అదాని కృష్ణపట్నం పోర్టులో బుధవారం భారీ నౌక (కేఫ్ వేజల్) లంగరు వేసింది. పోర్టులోని మూడో నెంబరు బెర్త్‌కు మొదటిసారి ఎంవీ యాన్ లీ అనే పెద్ద నౌక చేరుకుంది. 288.88 మీటర్ల పొడవు, 17.48 మీటర్లు డెప్త్ కలిగిన ఈ నౌక సౌతాఫ్రికా నుంచి 1.5 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుతో కృష్ణపట్నం పోర్టుకు చేరుకుంది. పోర్టులో మెరైన్ టీమ్ విజయవంతంగా కేఫ్ వేజల్ లంగర్ వేసుకునేందుకు కృషి చేశారు. కేఫ్ వేజర్ రాకతో అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు, జగదీష్ పటేల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీవోవో రాజన్‌బాబు, కెప్టెన్‌లు రజిత్‌గార్గ్, సాహు, కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ జి.వేణుగోపాల్, ేష్‌శర్మ, ఎస్‌కె.జునీద్, ఎండి.సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

- ముత్తుకూరు

'సోమశిల'లో 48.234 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, సెప్టెంబరు 11: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవా రం 15.879 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 77.988 టీఎంసీలు కాగా 48.234 టీఎంసీలకు చేరుకొంది. దిగువ డెల్టాకు 550, కండలేరుకు 10,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు నీటిని సరఫరా చేస్తున్నారు.

వినియోగంలోకి వస్తున్నాయ్..

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 11 : వైసీపీ సర్కారు హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన చెత్త సంపద కేంద్రాలను మళ్లీ వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి పంచాయతీ రాజ్ శాఖకు ఆదేశాలు అందగా, వెంటనే రంగంలోకి దిగిన అధికారులు కేంద్రాల స్థితిగతులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో చెత్త, పేడదిబ్బలు, మురికి నిల్వలు లేకుండా చేసేందుకు చెత్తతో



వచ్చే నెల 2 నుంచి చెత్త సంపద కేంద్రాల పునఃప్రారంభం

సంపద సృష్టించాలన్న గొప్ప లక్ష్యంతో 2014-2019లో తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చెత్త నుంచి సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలోని 722 గ్రామ పంచాయతీలలో 517 కేంద్రాలను అప్పట్లో నిర్మించారు. అయితే వీటిలో 486 కేంద్రాలు పూర్తవగా, కొన్నింటి పనులు జరుగుతున్నాయి.

● వైసీపీ హయాంలో నిర్వీర్యం

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ కేంద్రాలు మరుగునపడ్డాయి. ఐదేళ్లు గ్రామ పంచాయతీలను గాలికి వదిలేసినట్టుగానే ఈ కేంద్రాలను పూర్తిగా నిరుపయోగం గా మార్చేశారు. దీంతో గ్రామాల్లో స్వచ్ఛత కొరవడింది. మురికిగుంతలు, వీధుల్లోనే చెత్త నిల్వలు, ఇళ్ల పక్కనే పేడదిబ్బలు ఉండటంతో పల్లెసీమలు మురికికూపంగా కొనసాగా యి. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో చెత్తసంపద కేంద్రాలకు మళ్లీ కదలిక ఏర్పడింది. గ్రామాల్లో ఉన్న చెత్త ను, పేరుకుపోయిన పేడదిబ్బలను ఎప్పటికప్పుడు తరలిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు చెత్త సంపద కేంద్రాల ద్వారా వర్మీకంపోస్టు ఎరువులు తయారుచేసి, రైతులకు అమ్మడం ద్వారా సంపద సృష్టించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో ఉన్న చెత్త సంపద కేంద్రాల ను అక్టోబరు 2నుంచి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నా రు. కేంద్రాలను శుభ్రం చేయడంతోపాటు అవసరమైన మరమ్మతులు చేస్తున్నారు. తొలి గా 486 కేంద్రాలను, ఆ తర్వాత మిగిలిన 31 కేంద్రాలను వినియోగంలోకి తేనున్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు 'సహకార'ం

నెల్లూరు (హరనాథపురం) : రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి నిల్వ చేసుకోవడానికి వీలుగా మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను రిజిస్టర్ చేస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి బి.గురప్ప చెప్పారు. బుధవారం నగరంలోని తన కార్యాలయంలో ఉలవపాడు మండల వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల పరస్పర సహాయ సహకార సంఘ సభ్యులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రికార్డుల నిర్వహణ, ఎన్నికలు, ఏపీ మాక్స్ చట్టం 1995 తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం సంఘం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందచేశారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ వైద్యులు

జీవో నెం.85ను రద్దు చేయాల్సిందే!

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 11 : నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద బుధవారం వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెం.85ను రద్దు చేయాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి మాట్లా డుతూ జీవోను రద్దు చేసి గతంలో లాగానే పీజీ కౌన్సెలింగ్ చేపట్టాలని కోరారు. అలాగే టైమ్ బౌండ్ ప్రమోషన్లలో 6 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా, 12 ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి సివిల్ సర్జన్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర అలవెన్స్‌లు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే దశల వారీ ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసనలోలో అసోసియేషన్ నేతలు రవీం ద్రనాథ్‌రెడ్డి, ధర్మేంద్ర, అహ్మద్‌బాబు, బాలచంద్రబాబు, శాంతి, రమాకుమారి, భానుప్రి య తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో విధి నిర్వహణ

నెల్లూరు(వెంకటేశ్వరపురం) : అడవుల సంరక్షణ కోసం విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం అర్పించిన అమరవీరుల స్ఫూర్తితో అందరూ విధులు నిర్వహించాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్ పేర్కొన్నారు.



అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం జిల్లా అటవీశాఖ కార్యాలయంలోని అమరవీరుల స్థూపానికి అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో శ్రీనివాసులరెడ్డి, రేంజర్ మాల్యాద్రి, ఉద్యోగ సంఘం నాయకులు పిచ్చిరెడ్డి, రవి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



క్రేన్ సహాయంతో ప్రతిమలను నిమజ్జనం చేస్తూ..



నెల్లూరు : గణేష్ ఘాట్ వద్ద గంగా హారతులు ఇస్తున్న వేదపండితులు

"దండాలయ్యా.. ఉండ్రాలయ్యా.. దీవించయ్యా దేవా..!' అంటూ ప్రజలు గణనాథుడికి ఐదు రోజులపాటు విశేష పూజలు చేశారు. తమ భక్తిని చాటుకుంటూ ఖర్చుకు వెనుకాడకుండా ఉత్సవ కమిటీలు ఉత్సవాలను నిర్వహించాయి. 'చవితి' రోజున గణనాథుడి ప్రతిమ ఏర్పాటు మొదలు నిమజ్జనం వరకు ఆర్భాటంగా పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వీధి వీధినా వినాయక మండపాలు ఏర్పాటు చేసి తమ భక్తిని చాటుకున్నారు. అధికారికంగా అనుమతులు తీసుకున్న మండపాల కన్నా, అనుమతులు లేనివి రెండు రెట్లు అధికంగా ఉంటాయని అధికారుల అంచనా. జిల్లాలో కొన్నిచోట్ల మూడో రోజు నిమజ్జనం చేయగా చాలా వరకూ ఐదో రోజు బుధవారం నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. జిల్లాలో మొత్తంగా ఉత్సవాల ఖర్చు రూ.వంద కోట్లు దాటింది. గణేశుడి పుణ్యమా అని చాలా వర్గాలకు ఉపాధి దొరికింది. హైరర్స్ నుంచి బాణా సంచా వ్యాపారాల వరకూ పుష్కలంగా సాగగా, ఆ వర్గాలను నమ్ముకున్న కూలీలకు చేతినిండా పని దొరికింది.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి



నెల్లూరు : మాగుంట లేఅవుట్‌లో తంజావూరు శిల్పాకళను పోలిన మండపం

బైబై గణేశా!



ఉత్సాహంగా విఘ్నేశ్వరుడి ప్రతిమల నిమజ్జనం

నెల్లూరులో వైభవంగా శోభాయాత్ర

గణేశ్ ఘాట్‌లో కనులపండువగా గంగా హారతులు



తాత్కాలిక గణపతి ఊరేగింపులో శంఖం పూరిస్తూ పాల్గొన్న ఎమ్మెల్యే కోటంరెడ్డి, బీజేపీ నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం) : 'చవితి' ఉత్సవాల్లో ఐదవ రోజు విఘ్నేశ్వరుల ప్రతిమల నిమజ్జనం ఉత్సాహంగా జరిగింది. స్వామివారికి విశేష పుష్ప, విద్యుద్దీపాలంకరణ, మంగళవాయిద్యాలు, తప్పెట్లు, తీన్‌మార్, డీజే సంగీతాలతో 'జై బోలో గణేష్ మహరాజ్' అంటూ యువకుల నినాదాలతో ఊరేగింపు జరిగింది. నెల్లూరులోని తిక్కనపార్కు ఘాట్, మూలాపేట ఇరుకళల పరమేశ్వరి స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్‌ల వద్ద తెల్లవారుజాము వరకు దాదాపు 350కిపైగా చిన్నా పెద్దా ప్రతిమల నిమజ్జనాలు జరిగాయి. కార్పొరేషన్, పోలీస్, అగ్నిమాపక దళం, మత్స్య శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేశారు. జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రముఖ ఆలయాల నుంచి తెచ్చిన ప్రసాదాలను భక్తులకు అందజేశారు. క్రాంతినగర్ శివకేశవుల దేవస్థానం, మాగుంట లే అవుట్‌లో ఏర్పాటు చేసిన లంబోదర సెట్టింగ్ నుంచి ఉత్సవ గణపతి నిమజ్జనం భారీ స్థాయిలో జరిగింది. శివాజీనగర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక గణపతికి నగరోత్సవం జరిగింది. ఈ ఉత్సవంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ఎండీ దీపావెంకట్ పాల్గొని పూజలు చేశారు.

● కిక్కిరిసిన గణేశ్ ఘాట్

నగరంలోని నెక్లెస్‌రోడ్డు, ఇరుకళల పరమేశ్వరి ఆలయం గణేష్ ఘాట్‌లో బుధవారం రాత్రి గణేష్ నిమజ్జనం, శోభాయాత్ర, గంగా హారతుల వేడుకలు అంబరాన్ని అంటాయి. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు. ఘాట్‌లో కేరళ వాయిద్య కళాకారులు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల కోలాటం, విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మట్టి గణపతికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారాలతో పల్లకిపై శోభాయాత్ర జరిగింది. ఈ యాత్రలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, విక్రమ సింహపురి గణేస్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పిట్టు సత్యనాగేశ్వర రావు, కార్యదర్శి పి.సురేంద్రరెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ ఎండీ దీపావెంకట్, మాజీ మేయర్లు అనురాధ, భానుశ్రీ, కార్పొరేటర్లు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శంఖం పూరించగా గణేష్ ఘాట్‌లో సామూహిక గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● కనుల పండువగా హారతులు

వారణాసి, హరిద్వార్‌లలో జరిగే విధంగా గణేష్ ఘాట్‌లోనూ గంగాహారతులు కనుల పండువగా జరిగాయి. వేద పండితుడు వేదగిరి ఫణిశర్మ నేతృత్వంలో గణపతి పూజ, కలిశ ప్రతిష్ఠ పూజ, గంగా పూజలు చేశారు. భక్తుల జయ జయ నినాదాల నడుమ వేదపండితులు గంగాదేవికి (స్వర్ణాల చెరువు)కు ప్రణవానమామి, ధూపం, దీపం, నక్షత్ర హారతులు, నాగ హారతులు, వస్త్ర సమర్పణలు చేశారు. అనంతరం గంగా, యమున, భద్ర, పెన్నా నదుల నుంచి తెచ్చిన పవిత్ర జలాలను భక్తులపై సంప్రోక్షణ చేశారు. ఈ సందర్భంగా వేదికపై విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలకు, ఘాట్‌ల మరమ్మతులు, ఏర్పాట్లు దాదాపు రూ.2కోట్లకుపైగా విడుదల చేసిన సీఎం చంద్రబాబుకు, రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

● భద్రతా ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు (క్రైం) : ఇరుకళల పరమేశ్వరి ఆలయ పరిసరాల్లో గణేష్ నిమజ్జన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

'చవితి' ఖర్చు

రూ.100 కోట్లు

ఈ ఏడాది వైభవంగా వినాయక చవితి

వీధి వీధినా మండపాలు ఏర్పాటు చేసి పూజలు

ఒక్కో మండపం ఖర్చు సరాసరి రూ.లక్ష

అనుబంధ వ్యాపారాలకూ మంచి డిమాండ్

గతానికి భిన్నంగా ఈ ఏడాది వినాయక చతుర్థి ఉత్సవాలు జరిగాయి. ఐదు రోజులపాటు జరిగిన ఈ వేడుకలను గమనించిన ప్రజలకు ఈ విషయం ఈపాటికే అర్థమై ఉంటుంది. గతంలో ఒక ప్రాంతం లేదా ప్రధాన కూడలిలో గణనాథుడి ప్రతిమను ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఏడాది మాత్రం వీధి వీధినా విగ్రహాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లోనూ ఒక బొమ్మ పెట్టే విధానం పోయి కొన్ని వీధులు కలిసి ఒక విగ్రహం ఏర్పాటు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రజల్లో భక్తిభావం పెరిగిందనడానికి ఇది నిదర్శనమని ఆధ్యాత్మికవేత్తలు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది వినాయక మండపాలకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు మంజూరు చేసింది. జిల్లామొత్తంగా 3209 మండపాలకు అనుమతులు తీసుకున్నారు. అయితే, ఇవన్నీ పెద్ద స్థాయిలో వేడుకలు నిర్వహించిన మండపాలు. కానీ ఓ మోస్తరు, చిన్నస్థాయిలో ఉత్సవాలు నిర్వహించిన మండపాలు ఈ సంఖ్యకు రెండింతలు ఉంటాయని అంచనా. ఈ లెక్కన జిల్లా మొత్తం ఎప్పుడూ లేని విధంగా పది వేలకుపైగా వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. నగరం, పట్టణాల్లో ప్రతి అపార్టుమెంట్‌లో ఉత్సవాలు జరిపారు. షాపింగ్ కాంప్లెక్స్‌లలోనూ వినాయక ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



● నిత్యం ప్రత్యేక అలంకరణలు

వినాయక మండపాల వద్ద ఉత్సవాలు జరిగినన్ని రోజులూ నిత్యం ప్రత్యేకంగా గణనాథుడిని అలంకరించారు. పూల అలంకరణ ఖర్చే ఇందులో ఎక్కువగా ఉంది. అందులోనూ నిమజ్జనం రోజున గణనాథుడితోపాటు వాహనాన్ని అలంకరించేందుకు భారీగా ఖర్చు చేశారు నిర్వాహకులు. దీంతో పూలకు మంచి డిమాండ్ ఏర్పడింది. కొందరు ఉత్సవ కమిటీ నిర్వాహకులు బెంగళూరు నుంచి నిత్యం పూలను తెప్పిం చారు. మండపాల వద్ద వివిధ అలంకరణలో టెంట్లు వేయడంతో పాటు కుర్చీలు, టేబుళ్ల ఏర్పాటుతో హైరర్స్ వ్యాపారం కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా జరిగింది. చాలా చోట్ల విద్యుద్దీప అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొన్ని మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టు కున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి టీవీ, సినీ ఆర్టిస్టులను తీసుకొచ్చి కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజున నిమజ్జనం సందర్భంగా డీజేలు, బ్యాండ్‌మేళాల ఏర్పాటుతో భారీగా ఖర్చు చేశారు. ఇక బాణాసంచా విషయంలోనూ నిర్వాహకులు వెనకడుగు వేయలేదు. ఈ ప్రభావంతో బాణాసంచా ధరలు అమాం తం పెరిగిపోయాయి. చాలా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కాగా భారీ సంఖ్యలో వినాయక మండపాలు ఏర్పాటు చేయడంతో పూజారులకు కూడా చేతినిండా పనిపడింది. వారికి కూడా మంచి సంభావనలు లభించాయి.

● ఖర్చు ఇలా..

ఈ ఏడాది ఏ మండపం వద్దకు వెళ్లినా ప్రత్యేకత కనిపించింది. అందుకు మండపాలను ఖర్చుకు వెనుకాడకుండా అలంకరించడమే కారణం. విగ్రహాలు కూడా ఆకట్టుకున్నాయి. వివిధ దైవరూపాల్లో వినాయకుడు దర్శనమిచ్చాడు. విగ్రహాల ధర రూ.10 వేల నుంచి 2 లక్షల వరకూ ఉంది. చాలా వరకూ రూ.20 వేల నుంచి 80 వేల ధర మధ్యనున్న ప్రతిమలనే కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. సరాసరి ఒక్కో విగ్రహం విలువ రూ.30 వేల వరకూ ఉంది. ఆ లెక్కన చూసుకున్నా ఒక్క విగ్రహాల కొనుగోళ్లకే సుమారు రూ.30 కోట్లకుపైగా జిల్లాలో ఖర్చు చేశారు. ఇక మండపాల అలంకరణకు భారీగా ఖర్చయింది. హైరర్స్ నుంచి శోభాయత్రకు ఉపయోగించిన వాహనాల వరకూ లెక్క చూసుకుంటే పెద్ద మొత్తంలోనే ఉంది. పట్టణ ప్రాంతాల్లో కొన్ని మండపాల ఖర్చు రూ.10 లక్షలు దాటింది. జిల్లా మొత్తంగా చిన్న, పెద్ద మండపాలను చూసుకుంటే ఒక్కో మండపం ఖర్చు సరాసరి రూ.లక్ష వరకూ ఉంది. ఆ లెక్కన పది వేల మండపాలకు 'చవితి' ఉత్సవాల ఖర్చు రూ.100 కోట్లు దాటి ఉంటుందని అంచనా. ఈ స్థాయిలో ఖర్చు గతంలో ఎప్పుడూ జరగలేదని ఉత్సవ కమిటీల నిర్వాహకులు చెబుతున్నారు.

జిల్లావ్యాప్తంగా ఏర్పాటైన మండపాల వివరాలు

పోలీస్ సబ్ డివిజన్	అనుమతులు	లేనివి
నెల్లూరు నగరం	421	1,500
నెల్లూరు రూరల్	748	1,500
కావలి	1,112	1,000
ఆత్మకూరు	642	1,000
కందుకూరు	286	1,000
మొత్తం	3,209	7,000



నెల్లూరు నగరంలో బుధవారం రాత్రి వినాయక నిమజ్జన ఊరేగింపులో యువకుల ఉత్సాహం

వరద బాధితులకు విరాళాలు

కావలి (టౌన్) : విజయవాడ వరద సహాయక చర్యల నిమిత్తం కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి రూ.10 లక్షలు విరాళం అందించారు. బుధవారం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఆయన నివాసంలో ప్రతాప్ కుమార్‌రెడ్డి కలిసి విరాళపు చెక్కు అందించారు.



ఎమ్మెల్యేకు చెక్కులు అందజేస్తున్న టీడీపీ నేతలు, వ్యాపారులు, రియల్టర్లు

● బుచ్చిరెడ్డిపాలెం : నగర పంచాయతీతోపాటు మండలంలోని పలువురు నాయకులు, వ్యాపారులు, రియల్టర్లు, రూ.4 లక్షలను సీఎం సహాయనిధికి అందజేశారు. జడ్పీటీసీ సూరా ప్రదీప, సూరా శ్రీనివాసులురెడ్డి రూ.50వేలు, దామరమడుగు జక్కా వెంకయ్య చారిటబుల్ ట్రస్టు నుంచి సుంకర ఆదినారాయణ, బెల్లంకొండ లక్ష్మయ్య రూ.2లక్షలు, రియల్టర్లు మురళీకృష్ణ, దర్శి మాల కొండయ్య, మారంపూడి జగదీష్, నాగభూషణం రూ.1.5 లక్ష ల చెక్కును విజయవాడలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి అందజేశారు. దాతుల ఇచ్చిన చెక్కును విజయవా డలోనే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణకు ఎమ్మెల్యే అందజేశారు.



జగన్‌కు చెక్కు ఇస్తున్న ప్రతాప్‌కుమార్ రెడ్డి

రేపు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ధర్నా

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 11 : ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థలో 33 ఏళ్ల విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేస్తే తమకు రూ.వెయ్యి పింఛను ఇస్తున్నారని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వాపోయారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో తమ దయనీయ స్థితిగతులను విలేకరులకు వివరించారు. తమకు పింఛను పెంచాలన్న డిమాండ్‌తో ఈనెల 13న నెల్లూరు ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నామని తెలిపారు. ఈ ధర్నాకు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు అందరూ పాల్గొనాలని కోరారు. అనంతరం వారి డిమాండ్లతో కూడిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి ఎంఆర్ రెడ్డి, జి.శంకరయ్య, వీపీ నరసింహారెడ్డి, టీఆర్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ట్యాంకర్ బోల్తా

● డ్రైవర్ నిద్రమత్తుతో ప్రమాదం

సంగం, సెప్టెంబరు 11: పెరమన క్రాస్ రోడ్డు సమీపంలోని ముంబాయి జాతీయ రహదారిలో బుధవారం తెల్లవారుజామున సిమెంట్ ట్యాంకర్ బోల్తా పడింది. వివరాల మేరకు.. లూజ్ సిమెంట్‌ను కృష్ణపట్నం పోర్టులో అన్‌లోడ్ చేసి తిరిగి ఖాళీగా వెళ్తుండగా నిద్రమత్తులో డ్రైవర్ అదుపు తప్పడంతో వాహనం డ్రైనేజీ కాలువలో దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. కానీ ట్యాంకర్ దెబ్బతినింది. డ్రైన్ కాలువ చాలా లోతుగా ఉండడంతో నాలుగు క్రేన్ల సహకారంతో దాన్ని బయటకు తీశారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.



బోల్తా పడిన ట్యాంకర్‌ను వెలికితీస్తున్న క్రేన్

కొత్తూరులో పూరిల్లు దగ్ధం

రూ.12 లక్షల ఆస్తి నష్టం

కలిగిరి, సెప్టెంబరు 11: మండలంలోని కొత్తూరులో బుధవారం ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం జరిగి, మక్కెన వెంకటేశ్వర్లుకి చెందిన పూరిల్లు దగ్ధమైంది. గ్రామస్థుల కథనం మేరకు, వెంకటేశ్వర్లు పొలానికి వెళ్లగా, ఆయన భార్య ఇంటి బయట పనులు చేసుకుంటుండగా ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. పూరిల్లు, రేకులపంచ కావడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఇంట్లోని రూ.6లక్షల నగదుతోపాటు మరో రూ. 6లక్షల విలువైన వస్తువులు, సామగ్రి కాలిపోయినట్లు బాధితులు పేర్కొన్నారు. ఆత్మకూరు నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను ఆర్పేసి నట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్ నెంబర్లాట బుకీ అరెస్ట్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 11: ప్రభుత్వం నిషేధించిన సింగిల్ నెంబర్ లాటరీ నిర్వహిస్తున్న బుకీని సంతపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. పోలీసులకు అందిన సమాచారం మేరకు నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మధ్యవర్తులతో సింగిల్ నెంబర్ రాస్తున్న అమర్‌పృధ్వీని పట్టుకొని విచారించారు. తనతో పాటు నెల్లూరు కటారిపాలెంకు చెందిన కాగితాల రాజా, కపాడిపాలెంకు చెందిన సతీష్, ములుముడి బస్టాండ్‌కు చెందిన రఫీద్, రంగనాయకుల పేటకు చెందిన జహీద్‌లతో కలిసి సింగిల్ నెంబర్ ఆటలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. దీంతో అమర్‌పృధ్వీ చేత సింగిల్ నెంబర్‌లు రాయిస్తున్నారు. ఈ క్రమంలో కోటమిట్టకు చెందిన లతీఫ్, కుక్కలగుంటకు చెందిన మస్తాన్, చంద్రమౌళి నగర్‌కు చెందిన గిరికుమార్, మూలాపేటకు చెందిన బద్రి, ఈద్గమిట్టకు చెందిన గౌస్, నిప్పోసెంటర్‌కు చెందిన జహీర్, కామాటి వీధికి చెందిన బ్రహ్మయ్య, పాతపెద్ద ఆసుపత్రి వద్ద ఉన్న శివ, నవాబుపేటకు చెందిన శ్రీనివాసులు, ఈద్గామిట్టకు చెందిన కుమార్, ఉప్పరపాలెంకు చెందిన ఈశ్వర్, నెల్లూరు పాత పెద్దాసుపత్రికి చెందిన లతీఫ్‌లు సింగిల్ నెంబర్ ఆట ఆడేందుకు అమర్‌పృధ్వీ వద్ద డబ్బులు చెల్లిస్తున్నారు. పోలీసులు అమర్ వద్ద ఉన్న రూ.14,980, నెంబర్లు రాసిన రెండు నోట్‌బుక్స్‌ను స్వాధీనం చేసుకొని అమర్‌ను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ మోటార్ల దొంగల పట్టివేత

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 11 : పంట పొలాల్లో మోటార్ల దొంగతనాలకు పాల్పడే ఇద్దరు వ్యక్తులను మండలంలోని సజ్జాపురం గ్రామస్థులు బుధవారం పట్టుకున్నారు. పొలాల్లోని మోటారును అపహరించి స్కూటర్‌పై పెట్టుకుని వెళ్తుండగా అనుమానం వచ్చిన గ్రామస్థులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు దొంగలుగా తేల్చి రూరల్ పోలీసులకు అప్పగించారు. కాగ వీరిద్దరు స్థానిక గ్రామానికి చెందిన వారుగా తెలుస్తోంది. పోలీసులు అధికారికంగా వివరాలు తెలియజేయాల్సి ఉంది.

బేల్దారి కూలీ అదృశ్యంపై కేసు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 11: పనులకు వెళ్లిన బేల్దారి కూలీ అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... నెల్లూరు రూరల్ మండలం నాల్గో మైలులో బీ రామకృష్ణ, సాయికుమారి దంపతులు నివాసం ఉంటున్నారు. రామకృష్ణ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 2వ తేదీన ఆయన పనుల నిమిత్తం నగరంలోని తడికలబజారు సెంటర్‌కు వెళ్లారు. అక్కడ నుంచి ఆయన జాడ కన్పించలేదు. మంగళవారం రాత్రి సాయికుమారి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతి ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు.

రైలు ఢీకొని కూలీ మృతి

బిట్రగుంట, సెప్టెంబరు 11: బిట్రగుంట రైల్వేస్టేషన్‌కు ఉత్తరాన ఎగువ మార్గంలో గుర్తు తెలియని రైలు ఢీకొని చిరుతోటి శ్యాంసన్ (51) మృతిచెందినట్లు కావలి రైల్వే హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు, బోగోలు మండలం రామస్వామి పాలేనికి చెందిన శ్యాంసన్ దినకూలీగా పనిచేస్తున్నాడు. రైల్వేట్రాక్‌కు పడమరన కొత్తూరులో ఉన్న మేస్త్రీ ఇంటికి వెళ్లేందుకు ఉదయం ఇంటి నుంచి బయలు దేరాడు. రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందాడని ఆయన తెలిపారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి, శవపంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అందచేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6925
వెండి కిలో ధర	రూ. 85,500
వెండి ఒక గ్రాము	రూ. 88.50

ఆత్మహత్య కేసులో ఒకరి అరెస్ట్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 11: నగరంలోని నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలోని బంగ్లాతోటకు చెందిన బుడ్డబక్షాని హరనాథ్(42) ఆత్మహత్య చేసుకున్న ఘటనకు కారకుడైన అదే ప్రాంతానికి చెందిన చేజర్ల ప్రేమ్ చంద్‌ను నవాబుపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్ బాషా మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ హరనాథ్ ఆత్మహత్య చేసుకోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ప్రేమ్‌చంద్ మోసం చేసి హరనాథ్ వద్ద రూ.8 లక్షల తీసుకుని ఇవ్వకపోవడంతో ఆబాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని రుజువు అయ్యిందన్నారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు పంపామని తెలిపారు.

పొగాకు సాగు విస్తీర్ణం పెంపు

రైతాంగం హర్షం

కలిగిరి, సెప్టెంబరు 11: వాణిజ్య పంటగా పేరుగాంచిన పొగాకు సాగుకు రైతుల విన్నపా లను పరిగణలోకి తీసు కున్న పొగాకు బోర్డు ఎకట్టకేలకు సాగు విస్తీర్ణం పెంపునకు అనుమతి ఇచ్చింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి గత 15 ఏళ్ల క్రితం ఒక్కో బ్యారన్ పరిధిలో 45 క్వింటాళ్ల పొగాకు విక్రయిం చుకొందుకు అనుమతులుండేవి. అనంతరం కొంతకాలానికి దానిని 28 క్వింటాళ్లకు తగ్గించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో దానిని మళ్లీ 35 క్వింటాళ్లకు పెంచారు. ప్రస్తుతం ఒక బ్యారన్ కలిగిన రైతు 7.5 ఎకరాల విస్తీర్ణంలో పొగాకు పంట సాగు చేసి తద్వారా 35 క్వింటాళ్ల పొగాకు విక్రయానికి మాత్రమే బోర్డు అనుమతి ఉంది. అయితే వాతవరణ పరిస్థితుల ప్రభావంతో బోర్డు అనుమతించిన విస్తీర్ణం కంటే అదనంగా సాగుచేయడం ద్వారా బోర్డు అనుమతించిన 35 క్వింటాళ్ల కన్నా పొగాకు ఎక్కువగా పండిస్తున్నారు. ఈ క్రమంలో పొగాకు సాగు చేసిన రైతాంగం గత రెండేళ్లుగా మద్దతు ధర లభించడంతో కాసింత ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. అయితే ఏడాదికేడాది సాగులో దుక్కులు, పొగనారు, కూలీలు, మొక్క నాటడం, రెల్చడం, బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్‌కు అవసరమైన కట్టె ఖర్చులు అమాంతంగా పెరుగుతుండడంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. దీంతో సాగు విస్తీర్ణం, ఎక్కువ మోతాదులో అమ్మకాలకు అనుమతులివ్వాలని గత కొంతకాలంగా రైతులు కోరుతున్నారు. ఒక రైతు ఒక బ్యారన్ పొగాకు సాగులో 60 క్వింటాళ్లు దిగుబడి సాధిస్తేనే కాసింత ఆర్థికంగా నిలదొక్కుకోవడం సాధ్యపడుతోంది. ఈ క్రమంలో అనుమతించిన దానికన్నా ఎక్కువ పొగాకును పండించిన రైతు ఇతర బ్యారన్‌ల యజమానుల పేర్లు మీద విక్రయాలు సాగించడం లేదా బోర్డుకు అపరాధ రుసుము చెల్లించి అదనపు పొగాకును విక్రయించుకోవడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రైతు సంఘాల నాయకులు రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో 2024-25 పంట కాలనికి ఒక్కో బ్యారన్ కలిగిన రైతు 9.3 ఎకరాల విస్తీర్ణంలో పొగాకు పంట సాగు చేసి 42.75 క్వింటాళ్ల విక్రయాలకు అనుమతినిచ్చింది.



అనుమతులు పెంచడం రైతులకు వెసలుబాటు

పొగాకు రైతులకు రానున్న పంట కాలనికి సాగు, విక్రయాలకు అనుమతులు పెంచడం కాసింత వెసలుబాటు కలిగిస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఒక బ్యారన్‌కు 12 ఎకరాల్లో సాగుకు, 60 క్వింటాళ్ల పొగాకు విక్రయాలకు అనుమతి ఇచ్చేలా రైతు సంఘాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తాం.

- రావూరి శ్రీకాంత్ బాబు, రైతు నాయకుడు

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన అవసరం

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 11 : విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన అవసరమని ఆ శాఖ ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కరపత్రంను విద్యుత్ భవన్‌లో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు వినియోగదారులు, సిబ్బంది, రైతులు అవగాహన అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా గృహాల్లో హీటర్ల స్విచ్‌ని ఆపకుండా నీటిని వాడకూడదన్నారు. వర్షాకాలంలో విద్యుత్ స్తంభాల తీగలను తాకకూడదన్నారు. విద్యుదాఘతానికి గురైన వ్యక్తిని నేరుగా తాకకుండా రక్షించే చర్యలు చేపట్టాలన్నారు. ఐఎస్ఐ ముద్ర కలిగి ఉన్న సామగ్రిని మాత్రమే ఇంటికి వినియోగించాలన్నారు. చెప్పులు లేకుండా తడి చేతులతో మోటారు స్విచ్ వేయకూడదని తెలిపారు. చేపలు, రొయ్యల చెరువుల్లో విద్యుత్ తీగలను నేలపై వెయ్యవద్దన్నారు. సిబ్బందితోపాటు ప్రజలంతా అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను పూర్తిగా అరికట్టవచ్చన్నారు. ఈ కరపత్రాలను అన్ని ప్రాంతాల్లో పంపిణీ చెయ్యాలని ఆదేశించారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్ఈ, అధికారులు

వింజమూరులో మట్టి మాఫియా

ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలు ● పట్టించుకోని అధికారులు

వింజమూరు, సెప్టెంబరు 11: మండలంలో మట్టి మాఫియా రోజురోజుకూ చెలరేగిపోతోంది. చెరువులు, కుంటలే కాదు.. ఎక్కడ ప్రభుత్వ ఖాళీ స్థలం కన్పించినా అందులో మట్టిని తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటోంది. నియోజకవర్గంలో ప్రధాన వాణిజ్య పట్టణంతోపాటు స్కూళ్లకు ముఖ్య కేంద్రంగా ఉండటంతో చుట్టుపక్కల మండలాల అధికారులు, వ్యాపారులు, టీచర్లు వింజమూరులో నివసించేందుకు ఇష్టపడుతున్నారు. దీన్ని సొమ్ము చేసుకుంటున్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనుమతులు లేకుండా లేఅవుట్లను ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారు. లేఅవుట్లలో గుంతలు పూడ్చేందుకు, ఇతర నిర్మాణాల కోసం ఖాళీ స్థలాల్లో మట్టి తవ్వుతున్నారు. అధికారుల అనుమతి లేకుండా, ప్రభుత్వానికి పైసా చెల్లించకుండా మట్టిని తరలిస్తున్నారు. అయినా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. నెలవారీ మామూళ్లు ఇస్తున్నందునే అధికారులు తమ వైపు కన్నెత్తి చూడరని అక్రమార్కులు బహిరంగంగానే చెబుతున్నారు.



ట్రాక్టర్ మట్టి రూ.700 నుంచి రూ.వెయ్యి

ఇంత రేటు ఎందుకని ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారు ప్రశ్నిస్తే అందరికీ మామూలు ఇస్తున్నాం.. తప్పదని ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఈ సమస్యతో ఇల్లు కట్టుకునే సామన్యుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తతంగం అంతా సెలవు దినాల్లోని రాత్రి వేళల్లో మట్టిని తరలిస్తూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని నెలలుగా మట్టి తరలిస్తుండటంతో చెరువులు, ప్రభుత్వ భూముల్లో పెద్ద గుంతలు దర్శనం ఇస్తున్నాయి. ఈ గుంతలతో వర్షపునీరు చెరువులోకి రాక గుంతల్లో నిలిచిపోతోందని సమీప పొలాల రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

'వికసిత్ భారత్-2047' ప్రణాళిక రూపొందించండి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 11 : వికసిత్ భారత్-2047వ సంవత్సరం ప్రణాళిక రూపొందించాలని వైద్యాధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సూచించారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో వికసిత్ భారత్‌కు రూపొందించాల్సిన విధి విధానాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మాతృశిశు మరణాలతో పాటు క్షయ వ్యాధి, రోడ్డు మరణాలు, ఆత్మహత్యలు, మధుమేహం వంటి వ్యాధుల వల్ల సంభవించే మరణాలను నివారించాలని తెలిపారు. వికసిత్ భారత్ ప్రణాళికలో క్షేత్రస్థాయిలో అందే సూచనలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ఖాదర్‌వలి, నోడల్ అధికారి డాక్టర్ దయాకర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత, డెమో కనకరత్నం, డీపీవో డాక్టర్ రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

పేట దర్గా ఏక్‌దిన్ కా సజ్జాద ఫయాజ్

ఆయన చేతుల మీదనే దొరసానమ్మ గంధోత్సవం
వక్ఫ్ బోర్డు సీఈవో ఆదేశాలు జారీ

ఏఎస్ పేట, సెప్టెంబరు 11: హజరత్ సయ్యద్ ఖాజ రహమతుల్లా నాయబ్ రసూల్ సతీమణి హబీబా ఖాతూన్ (దొరసానమ్మ) గంథ మహోత్సవం నిర్వహించే అవకాశం దర్గా వంశస్థుడు ఎస్‌జీఎస్ ఫయాజ్ అహ్మద్‌కు కల్పించినట్లు రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవో ఆదేశాలు జారీ చేసినట్లు దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ తెలిపారు. బుధవారం ఆయన దర్గాలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దర్గా మాజీ ఉప సజ్జాద నఫీజ్ బాష గంధం ఎత్తే అవ కాశం తనకు కల్పించాలని హైకోర్టును ఆశ్రయించారు. దీనితో ఆయన అభ్యర్థ నను పరిశీలించాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవోకు ఉత్తర్వులు జారీ చేసింది. నఫీజ్ ఆర్డర్‌పై మాజీ ముతవల్లి హఫీజ్ పాషా హైకోర్టుకు అప్పీల్‌కు వెళ్లడంతో ఓ వారం పాటు వారి ఇరువురి వాదనలను సంబంధించి స్టే ఇవ్వడంతో వక్ఫ్‌బోర్డు సీఈవో మూడో వ్యక్తి దర్గా వంశస్థుడు ఎస్‌జీఎస్ ఫయాజ్‌కు గంధం ఎత్తడానికి అవకాశం కల్పించినట్లు చెప్పా రు. గత సంవత్సరం కూడా ఫయాజ్ గంధం ఎత్తారు. ఇప్పుడు ఒక్కరోజు గంధం నిర్వహిం చడంతో ఏక్‌దిన్‌కా సజ్జాదగా అని అందురూ అభివర్ణిస్తున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దర్గా ఈవో మహమ్మద్ హుసేన్

14న జిల్లాలో మహిళా కమిషన్ పర్యటన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 11: జిల్లాలో ఈ నెల 14వ తేదీన రాష్ట్ర మహిళా కమిషన్ గజ్జల వెంకటలక్ష్మి పర్యటించనున్నారు. కడప నుంచి రోడ్డు మార్గంలో ఉదయం 9 గంటలకు ఆమె నెల్లూరు రెవెన్యూ అతిథిగృహానికి చేరుకుంటారు. 11 గంటలకు నెల్లూరు సెంట్రల్ జైలుకు చేరుకుని జైల్లోని మహిళా ఖైదీలతో సమావేశమవుతారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరు నుంచి రోడ్డు మార్గంలో తాడేపల్లికి వెళ్తారు.

నర్సింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 11: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావస్ వాచ్‌ర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏఎస్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్‌సీ నర్సింగ్ చదివిన విద్యార్థులకు జపనీస్ భాష ఎన్5, ఎన్4, ఎన్3 నేర్పించి ఆ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సీ విజయవినీల్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ పొందే అభ్యర్థులు 32 సంవత్సరాల లోపు వయస్సు కలిగి జపనీస్ భాష నేర్చుకోవడంలో ఆసక్తి కలిగి ఉండాలని తెలిపారు. నావెజ్ హెచ్‌ఆర్ బెంగళూరులో ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తుందని, ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.1.10 లక్షల నుంచి రూ.1.40 లక్షలు వేతనం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9493904828, 9988853335 ను సంప్రదించాలని సూచించారు.

రూ.కోటికి ఎసరు!

- సామాజిక వనాల అభివృద్ధికి కేంద్రం నిధుల కేటాయింపు
- వాటిపై కన్నేసి అటవీ అధికారులే పనులు చేయిస్తున్న వైనం
- కీలుబొమ్మలుగా మారిన పనులు చేయాల్సిన వీఎస్ఎస్‌లు
- వరికుంటపాడు అటవీ బీట్ పరిధిలో జరుగుతున్నదీ తతంగం

అడవిలో జరిగే తతంగం కదా బయటి ప్రపంచానికి ఎలా తెలుస్తుందిలే అనుకున్నారో లేక.. తామే పనులు చేస్తున్నాం కదా.. ప్రశ్నించే వారు ఎవరుంటారులే అనుకున్నారో ఏమోగానీ ఉదయగిరి అటవీశాఖ అధికారులు సరికొత్త అవినీతి దందాకు శ్రీకారం చుట్టారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. అటవీ విస్తీర్ణం పెంచాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సామాజిక వనాల అభివృద్ధికి నిధులు కేటాయించింది. ఈ నిధులపైన అటవీశాఖ అధికారులు కన్నేశారు. తాము ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తూ కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి నామమాత్రంగా ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటిస్తున్నారు.



అధికారులు చేపట్టిన ప్లాంటేషన్ పనులు

వరికుంటపాడు, సెప్టెంబరు 11: వరికుంటపాడు, దుత్తలూరు మండలాల సరిహద్దు ప్రాంతంలోని కొత్తపేట ఏరియాలోని 116హెక్టార్ల ప్రభుత్వ బంజరు భూముల్లో ప్రత్యామ్నాయ వనరీకరణ పథకం కింద మొక్కలు నాటి వాటిని సంరక్షించి వనాలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు కేటాయించింది. ఈ నిధులతో ప్రభుత్వ బంజరు భూముల్లో వన సంరక్షణ సమితి (వీఎస్ఎస్) ఆధ్వర్యంలో మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను చేపట్టాల్సి ఉంది. దీంతో వచ్చే ఆదాయం సైతం వీఎస్ఎస్ కమిటీలకే చెందేలా నిబంధనలు ఉన్నాయి. ఈ పనులు కేవలం పర్యవేక్షణ చేయాల్సిన కొంతమంది అటవీశాఖ అధికారులు ఇదే అదునుగా భావించి వీఎస్ఎస్ కమిటీలను కీలుబొమ్మలుగా చేసుకొని స్వతహాగా పనులు చేపట్టి జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏమాత్రం నిబంధనలు పాటించకుండా మొక్కుబడిగా మొక్కలు నాటి చేతులు దులుపుకుంటున్నా అటువైపు కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యారు. కనియంపాడు వీఎస్ఎస్ ఆధ్వర్యంలో పనులు జరగాల్సి ఉండగా వారిని నామమాత్రపు కాపలాదారులుగా అధికారులు మార్చి మొక్కలు నాటే పనికి శ్రీకారం చుట్టారు.

ఎండుతున్న మొక్కలు..

పనుల్లో ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా 30సెం.మీ లోతు, వెడల్పు ఉండేలా కూలీల ద్వారా గుంతలను తీయించాల్సి ఉండగా ఎక్సకవేటర్లతో నామమాత్రంగా తీయించి మొక్కలు నాటుతుండడం విశేషం. దీంతో పనులు పూర్తి కాకుండానే మొక్కలు కేవలం ఎండబెట్టకే చనిపోతున్నాయి. అదీనూ ఆ సమయంలో ముందస్తుగా గుంతల్లో డీఏపీ, యూరియా, ఫాస్పరస్ వంటి రసాయనిక ఎరువులను వేయకుండానే పూడ్చి వేస్తున్నారు. అంతేగాక భారీ స్థాయిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్లు రికార్డులను రూపొందించుకొని ఎంబుక్కుల్లో సైతం నమోదు చేసుకొని నిధుల స్వాహాకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. అలాగే విరువూరులోను 40హెక్టార్లలో మొక్కలు నాటేందుకు మరో రూ.30లక్షల నిధులు మంజూరయ్యాయి. వాటిని కాజేసేందుకు పూనుకున్న అధికారులు అక్కడ కూడా అదే తరహాలో పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇలాంటి పనులు చేసుకుని జీవనాధారం పొందే వీఎస్ఎస్ కమిటీలు పనులు చేసేందుకు ముందుకు వచ్చినా అధికారులు డిమాండ్ చేసే 40శాతం నిధులను మామూళ్ల రూపంలో ఇవ్వలేక వెనకడుగు వేస్తున్నారు. అంతేగాక నిత్యం పర్యవేక్షణ పేరుతో వేధింపులకు గురి కావాల్సి వస్తుందని తమగోడు వెల్లబోసుకుంటున్నారు. దాదాపుగా రేంజ్ పరిధిలోని అన్ని వీఎస్ఎస్ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులే చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. గత ఐదేళ్లగా గుట్టచప్పుడు కాకుండా అధికారులు దందా సాగిస్తున్నా బయటకు చెబితే ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని కమిటీ సభ్యులు నోరు మెదపడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి మారుమూల ప్రాంతంలో జరుగుతున్న అవినీతి ఆగడాలపై విజిలెన్స్ అధికారుల విచారణ చేపడితే మరింత అవినీతి భాగోతం వెలుగు చూసే అవకాశం ఎంతైనా ఉంది.



ఎండుముఖం పట్టిన మొక్క

వేడుకగా గణపయ్యల నిమజ్జనం

వినాయక చవితి సందర్భంగా పలుచోట్ల శనివారం ప్రతిష్ఠించిన గణపతి ప్రతిమలను, విగ్రహాలను ఐదోరోజు బుధవారం నిమజ్జనాలకు తరలించారు. ఉత్సాహంగా గ్రామోత్సవాలు, ఊరేగింపుల అనంతరం స్వామివారిని జలధివాసం చేశారు. జిల్లాలో జరిగిన కార్యక్రమాల వివరాలు..


కావలి రూరల్ : తుమ్మలపెంట తీరానికి నిమజ్జనానికి తరలిన భారీ వినాయకుడు

కావలి రూరల్ : మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, పెదపట్టపుపాలెం గ్రామాల్లోని వినాయక విగ్రహాలను ఐదోరోజు బుధవారం నిమజ్జనాలకు తరలించారు. తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ జీ రాజేశ్వరరావు పర్యవేక్షించారు.

కావలిటౌన్ : స్థానిక కలుగోళశాంబవి ఆలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండప ప్రత్యేక సెట్టింగులను తిలకించేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. బ్రిడ్జి కూడలిలో భగత్‌సింగ్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బుధవారం పలు ప్రాంతాల్లోని విగ్రహాలు నిమజ్జనానికి తీరానికి తరలివెళ్లాయి. ఆటోనగర్‌లో గణపతికి గ్రామోత్సవం నిర్వహించారు.


అల్లూరు : నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

గుడ్లూరు : ఐదు రోజులపాటు పూజలు అందుకున్న గణనాథులను బుధవారం నిమజ్జనానికి రామాయపట్నం సముద్రతీరానికి భక్తులు తరలించారు. గుడ్లూరు వడ్డెపాలెం, రజకపాలెం, బీసీ కాలనీ, సినిమాహాల్ సెంటర్‌లోని వినాయకులను రామాయపట్నంకు తరలించారు. మండలం నలుమూలల నుంచి బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంటున్న వినాయకులతో రద్దీ నెలకొంది.


లింగసముద్రం : ఊరేగింపుగా నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

అల్లూరు : మండలంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. అల్లూరు కోనేరు సెంటరులోని గణనాథుడిని హిందూ, ముస్లింలు కలసికట్టుగా నిమజ్జనానికి తరలించారు. ముందుగా లడ్డూ వేలం నిర్వహించగా ముస్లీంలు రూ.8.5 వేలకు కైవసం చేసుకున్నారు. కొన్నిచోట్ల ముగ్గుల పోటీలు, ఉట్టి మహోత్సవాలు చేపట్టారు.

కొండాపురం : ఐదోరోజు బుధవారం వినాయక ప్రతిమలను నిమజ్జనాలకు తరలించారు. చివరిరోజు అన్నదానం, యువతకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలంలో మొత్తం 17 గణనాథుల నిమజ్జనం జరిగినట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.


బిట్రగుంట : గణేశ్ నిమజ్జన అనంతరం సముద్ర స్నానమాచరిస్తున్న భక్తులు

లింగసముద్రం : మండలంలోని లింగసముద్రం, వెంగళాపురం, మొగిలిచెర్ల, చీమలపెంట తదితర గ్రామాల్లో ఐదోరోజు బుధవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో భక్తులు గణనాథుడి విగ్రహాలకు పూజలు చేసి, అనంతరం అన్నదానం చేశారు. తదుపరి విగ్రహాలను ట్రాక్టర్లపై గ్రామాల్లో ఊరేగించారు. రాళ్లపాడు ప్రాజెక్ట్, మన్నేరులో నిమజ్జనం చేశారు.వెంగళాపురంలో నిర్వహించిన వేలంలో వెలుగు పెద కోటేశ్వరరావు రూ.50 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. మొగిలిచెర్లలో భారీ పోలీసు బందోబస్తు మధ్య విగ్రహాలను నిమజ్జనం చేశారు.


కందుకూరు : సాయినగర్ 2వ లైనులో నిమజ్జనోత్సవానికి తరలిస్తున్న వినాయకుడు

బిట్రగుంట : బోగోలు మండలంలో గణనాథుల నిమజ్జనం బుధవారం వైభవంగా జరిగింది. విశ్వనాథరావుపేట, కొత్తూరు, కోవూరుపల్లి, కడనూతల, ముంగమూరు గ్రామాల్లో గణేషుడి విగ్రహాల ఊరేగింపు అనంతరం తాటిచెట్లపాలెం, పాతపాలెం సముద్రానికి తరలించి నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. ఎ స్సై బోజ్య సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్రతీరాన వెండి కాలి గొలుసులు దొరికాయని, ఎవరైనా పోగొట్టుకుని ఉంటే స్టేషన్‌కు వచ్చి తీసుకుపోవాలని ఎస్సై తెలిపారు.

కందుకూరు : వినాయక నిమజ్జనోత్సవాలను కందుకూరు పట్టణం, పరిసర గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. పట్టణంలోని విగ్రహాలను ఐదవ రోజు నిమజ్జనం కోసం పాకల సముద్ర తీరానికి తరలించుకుని వెళ్లారు. సాయినగర్ 2వ లైనులో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. మండలంలోని పలుకూరు యువతీయువకులు పోకూరి వీరాస్వామి ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.

ఉదయగిరి రూరల్ : గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఐదోరోజు నిమజ్జనానికి తరలించారు. బుధవారం గంగిరెడ్డిపల్లి, గండిపాళెం, ఉదయగిరి పట్టణంలోని వాల్మీకివీధి, యాదవపాళెం, బ్రాహ్మణవీధి, బాలాజీనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను వాహనాల్లో ప్రతిష్టించి పురవీధుల్లో మేళతాళాల నడుమ నిమజ్జనానికి తరలించారు. అలాగే దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ గిరిజన కాలనీలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ జిల్లా నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, స్వాతి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కాలనీకి చెందిన నల్లుపాటి కొండయ్య స్వామివారి లడ్డూను వేలంలో రూ.20వేలకు దక్కించుకున్నారు. ఉట్టి మహోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. యువత రంగులు చల్లుకొని కేరింతలు కొట్టారు. అనంతరం సమీపంలోని నీటి వనరుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

సంగం: మండల కేంద్రంలోని రాళ్లచెలిక ఎస్టీ కాలనీ, వడ్డెపాళెం, సాయినగర్, కొత్తూరు తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు ట్రాక్టర్లపై ఉంచి వేడుకగా పెన్నానదికి నిమజ్జనానికి తరలించారు.

అనంతసాగరం: కొత్తపల్లిలోని నాలుగు వీధుల్లో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలను నిమజ్జనానికి తీసుకెళ్లారు. మాజీ సర్పంచ్ చల్లాచంద్రశేఖర్ రెడ్డి ఆలయంలోని స్వామికి గజమాల పూజలు చేశారు. అనంతరం బాణాసంచా కాలుస్తూ, తప్పెట్ల వాయిద్యాల మధ్య పెన్నానదికి తరలించారు.

సీతారామపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో గణనాథులను నిమజ్జనానికి తరలించారు. స్థానిక స్వామి చెరువులో విగ్రహాలను పోలీసు బందోబస్తు మధ్య నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీఎస్పీ వెంకటరమణ, సీఐ వెంకట్రావ్ బందోబస్తు నిర్వహించారు.


సంగం: గణేశుడి గ్రామోత్సవం


సీతారామపురంలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు


ఉదయగిరి రూరల్ : గంగిరెడ్డిపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

ప్రజలకు స్వచ్ఛమైన నీరివ్వాలి

● నీటి పథకాల పరిశీలనలో అధికారులు


గుడ్లూరు మంచినీటి పథకం వద్ద అధికారులను ప్రశ్నిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ హుస్సేన్

లింగసముద్రం, సెప్టెంబరు 11: రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా పనిచేస్తున్న మూడు భారీ నీటి పథకాల నుంచి ప్రజలకు స్వచ్ఛమైన నీరందించాలని నెల్లూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ షేక్ ఎండీ సత్తార్ హుస్సేన్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఆంధ్రజ్యోతిలో 'తాగునీటి పథకాల నిర్వహణ అధ్వానం' అనే శీర్షికన వచ్చిన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఈ క్రమంలో ఈఈ హుస్సేన్, కందుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె రామ్మోహన్‌రావు, ఏఈ సీహెచ్ రాజశేఖర్‌లు బుధవారం గుడ్లూరు, రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాలతో పాటు రాళ్లపాడు ప్రాజెక్టులోని ఇన్‌టెక్‌వెల్‌ను పరిశీలించారు. మంచినీటి పథకాల వద్ద విద్యుత్ రీడింగ్‌ను పరిశీలించారు. నీటి పంపింగ్ ఎన్ని గంటలు జరుగుతుంది ? సిబ్బంది ఎంతమంది ఉన్నారు ? అని డీఈని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోని నీటిని వారు పరిశీలించారు.నీరు పచ్చగా ఉండడాన్ని గమనించారు. ఇందుకు గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు.ప్రాజెక్టులో నీరు అడుగంటి ఉండడం, చేపలు పడుతున్నందున నీరు కలుషితమై వస్తున్నాయన్నారు. దీంతో ఆయన చేపలు పట్టే వారిని పిలిపించి, ఇన్‌టెక్ వెల్ సమీపంలో చేపలు పట్టవద్దని, దూరంగా పట్టుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఫిషరీస్ ఏడీతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ జనిగర్ల నాగరాజు, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్ పాల్గొన్నారు.

రామాలయాల నిర్మాణానికి సహకరించండి


మంత్రి ఆనంతో చర్చిస్తున్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, సెప్టెంబరు 11: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రామాలయాల నిర్మాణానికి సహకారం అందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడలో ఆయన మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను కలిసి పలు అంశాలపై చర్చించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాల నిర్మాణం కోసం తమవంతుగా కొంత మొత్తాన్ని భరించేందుకు గ్రామస్థులు సిద్ధంగా ఉన్నారని, మిగిలిన మొత్తాన్ని టీటీడీ నుంచి చెల్లించాలని కోరారు.ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వర్గీకరణను వెంటనే నిలిపివేయాలి

అల్లూరు, సెప్టెంబరు 11 : ఎస్సీల వర్గీకరణను వెంటనే నిలిపివేయాలని అల్లూరులో దళితులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ముందుగా పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీల వర్గీకరణను వెంటనే నిలపివేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణను నిలిపివేసి మాల మాదిగలను అన్యోన్యంగా మెలిగేలా చేయాలన్నారు. కార్యక్రమంలో దానం మాల్యాద్రి, ఉపినెర్తి కమలాకర్, కలిచేటి వెంకటేశు, గంగపట్నం జీవన్‌పాల్, గోళ్ల రాము, చెంతాటి ప్రణయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వైద్య సేవలు

కావలి, సెప్టెంబరు11: విజయవాడలోని వరద బాధితులకు కావలి రెడ్‌క్రాస్ మెడికల్ రిలీఫ్ టీం బుధవారం వైద్యసేవలు అందించారు. లోతట్టు ప్రాంతాలైన సితారనగర్, కండ్రిక, సింగ్‌నగర్‌లలో వైద్యశిబిరాలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లు వైద్యశిబిరాలను సందర్శించి వారిని అభినందించారు. మచిలీపట్నంకు చెందిన రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు రమేష్‌బాబు కావలి సభ్యులను పరిచయం చేసుకున్నారు. రెడ్‌క్రాస్ మెడికల్ రిలీఫ్ టీంలో బీద లక్ష్మీనంద, నచికేత్, ఫయాజ్, మధు, వెంకటేశ్వర్ల తదితరులు ఉన్నారు.

చోరీ కేసు నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 11 : ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు.ఈ సంఘటన ఉలవపాడులోని కొత్తూరు శివారు ప్రాంతంలో జరిగింది. ఎస్సై అంకమ్మ కథనం మేరకు, షేక్ చౌదరి బాబు రిటైర్డ్ షిప్‌యార్డు ఉద్యోగి. గత నెల 20న పనిమీద కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఊరుకి వెళ్లాడు. ఈనెల11న తిరిగి ఉలవపాడుకు వచ్చారు. ఇంటి తలుపులు పగలకొట్టి, బీరువా తెరిచి ఉందని పోలీసులకు పిర్యాదు చేశారు. మూడు సవర్ల బంగారం, రూ.20 వేలు నగదు చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, సెప్టెంబరు 11 : మండలంలోని మన్నేరు వాగు సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా అందిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున ఎస్సై షేక్ మహబూబ్ సుభాని, సిబ్బంది గ్రామ శివారులో ట్రాక్టర్‌ను పట్టుకొని ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సుభాని చెప్పారు.

బాధితురాలికి ప్రభుత్వ సాయం : సీడీపీవో

ఉలవపాడు, సెప్టెంబరు 11: ఇటీవల లైంగినదాడికి గురైన బాలిక (9)కు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని ఐసీడీఎస్ సీడీపీవో అరుణ తెలిపారు. బుధవారం బాధితురాలి స్వగ్రామమైన మన్నేటికోట శంకర్ నగర్‌లో ఐసీడీఎస్ అనుబంధ విభాగాల అధికారులు కుటుంబ సభ్యులను కలిసి బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తల్లిదండ్రుల అనుమతి మేరకు బాలికను ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పి చదివిస్తామని చెప్పారు.

పారిశుధ్య కార్మికులను వెనక్కు రప్పించాలి

కావలిటౌన్, సెప్టెంబరు11: విజయవాడలో పారిశుధ్య పనుల నిమిత్తం పంపిన మున్సిపల్ కార్మికులను తిరిగి కావలికి రప్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం సీఐటీయూ గౌరవా ధ్యక్షుడు పెంచలయ్య మాట్లాడుతూ విజయవా డలో పారిశుధ్య పనుల నిమిత్తం కావలి నుంచి 90మంది కార్మికులను తీసుకెళ్లారని, పదిరోజులైనా వారిని తిరిగి పంపకపోవడం దారుణమన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు మధు సూదన్‌రావు, తురక శీనయ్య, శెట్టిపల్లి మాల కొండయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేయండి

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 11: బీజేపీ సభ్యత్వ సమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్ అన్నారు. దగదర్తి మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు బీప్రసా దరావు ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు జరిగింది. ఈ కార్యక్రమంలో భరత్ మాట్లాడారు. కావలి పటణ అధ్యక్షుడు కే బ్రహ్మానం దం, బోగోలు మండల అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసులు యాదవ్, పార్టీ నేత మహేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామసభను అడ్డుకోలేదు'

కొండాపురం, సెప్టెంబరు11: ఉపాధి హామీ గ్రామసభను తాను అడ్డుకోలేదని, తనిఖీ సక్రమంగా జరగలేదని అధికారులను ప్రశ్నించానని సాయిపేట గ్రామ టీడీపీ నాయకుడు వ ల్లూరు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం టీడీపీ నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను నిర్మించుకున్న గోకులం షెడ్డును తనిఖీ చేయమని సిబ్బందిని కోరగా, ఎందుకు రాలేదని ప్రశ్నించానే తప్ప అవినీతిని బయటకు రానివ్వకుండా తాను ఎవరినీ వెనుకేసుకొని రాలేదన్నారు. కార్యక్రమంలో ఇర్ల అంకబాబు, గంటా శ్రీనివాసులు, చెన్నపనాయుడు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించండి

మర్రిపాడు, సెప్టెంబరు 11: విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆత్మకూరు ఫారెస్టు డివిజన్ రేంజ్ అధికారి శేఖర్ తెలిపారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం 21జాతుల మొక్కలను నాటారు. పచ్చదనం పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు స్వప్న, ఎంపీడీవో నాగమణి, ఎంఈవో ధనలక్ష్మీ, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, టీడీపీ మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

ఆత్మకూరు, సెప్టెంబరు 11: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ ఉపాధి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేస్త్రీలను ఆదేశించారు. బుధ వారం ఆయన నారంపేటలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొలతల ప్రకారం పనిచేస్తే పూర్తి వేతనం లభిస్తుందన్నారు. ప్రతిరోజూ రూ.300 పొందేలా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృషి సారించాలని సూచించారు. కార్యక్రమంలో టీఏ వినోద్, ఎఫ్ఏ రామయ్య ఉన్నారు.

తన పొలంలో దారి కావాలంటున్నాడు !

● తహసీల్దారుకు బాధిత రైతు ఫిర్యాదు


తహసీల్దారు సోమ్లానాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు కృష్ణ

సంగం, సెప్టెంబరు 11: తాను సాగు చేసుకుంటున్న పొలాల్లో దారి కావాలని తన గ్రామానికి చెందిన సూర్యనారాయణ అనే రైతు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని సంగంకు చెందిన కృష్ణ అనే రైతు బుధవారం తహసీల్దారు సోమ్లానాయక్‌కు ఫిర్యాదు చేశాడు. తరుణవాయిలో తనకు, అలాగే సూర్యనారాయణకు పొలాలు ఉన్నాయని, మా ఇద్దరి పొలాల మధ్య స్కీమ్ కాలువ ఉందన్నారు. సూర్యనారాయణ పొలానికి వేరే దారి ఉన్నా మా పొలంలో నుంచి దారి కావాలని కక్ష సాధింపుతో ప్రతి సోమవారం నెల్లూరులో జరిగే స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడని ఆయన వినతిలో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సురేష్, మస్తానయ్య అనే రైతులు ఉన్నారు.

జగనన్న కాలనీల్లో పక్కాగృహాల పరిశీలన


పక్కాగృహాల కొలతలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 11: గంగిరెడ్డిపల్లి, వెంగళరావునగర్, గండిపాళెం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లోని పక్కాగృహాలను బుధవారం విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. బేస్‌మెంట్, రూఫ్, పూర్తయిన ఇళ్లను పరిశీలించి కొలతలు సేకరించి, నాణ్యత ప్రమాణాలు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం సిమెంట్, స్టీల్ గోదాంలను తనిఖీ చేసి స్టాకు పరిశీలించారు. అలాగే దుత్తలూరు మండలంలోని నర్రవాడ, దుత్తలూరు గ్రా మాల్లో నిర్మించిన పక్కాగృహాలను సైతం పరిశీలించి వివరాలు సేకరించారు. నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్ర మంలో విజిలెన్స్ ఏఈ వెంకటరెడ్డి, హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ ఈవీ ప్రసాద్, ఏఈలు రామకృష్ణ, యప్రాయం, వర్క్స్ఇన్‌స్పెక్టర్లు హర్ష వర్ధన్‌రెడ్డి, చెన్నరాయుడు, పోలయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టారని విజిలెన్స్ అధికారుల బృందం సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. జిల్లా విజిలెన్స్ ఏఈఈ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు బేస్‌మట్టం వరకు జరిగిన పనులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్, ఏఈ రామకృష్ణ, వర్క్స్ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సుధీర్ బాబు, నాగబాలు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవో విచారణ

కలువాయి, సెప్టెంబరు 11 : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన హిందీ టీచర్ రామకృష్ణ సక్రమంగా విధులకు హాజరుకాలేదన్న ఆరోపణలపై బుధవారం కావలి ఉప విద్యాశాఖాధికారి రఘురామయ్య విచారణ చేపట్టారు. హెచ్ఎం అబ్బాస్ ఆలీతో పాటు గతంలో ఇక్కడ హెచ్ఎంగా పనిచేసిన ఎస్.జనార్దన్‌రెడ్డిని కలిసి వివరాలు తెలుసుకుని రికార్డులు పరిశీలించారు.

అటవీ భూమిని స్వాధీనం చేసుకోండి

కందుకూరు: గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారి పక్కనే రామదూత ఆశ్రమం పేరుతో ఆక్రమించిన చెరువు పోరంబోకు, అటవీ భూమిని స్వాధీనం చేసుకోవాలని సబ్ కలెక్టరుకు విజ్ఞప్తి చేసినట్లు హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. సర్వే నెం 879లో చెరువు పోరంబోకు భూమిని, సర్వే నెం883లో అటవీ భూమిని రామ ఆక్రమించాడని పేర్కొన్నారు.

డిప్లమో కోర్సులో చేరేందుకు స్పాట్ కౌన్సెలింగ్

అనంతసాగరం: పదో తరగతి ఉత్తీర్ణులైన వారు 2024-25లో ఆచార్య ఎన్‌జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిప్లమో కోర్సులో చేరేందుకు స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజ రు కావాలని సోమశిల వ్యవసాయ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పుల్లంరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటలకు గుంటూరు కృష్ణా ఆడిటోరియంలో జరుగుతుందన్నారు.

రేపు మహాజన సభ

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 11: కమ్మవారిపాలెం పీఏసీఎస్‌లో శుక్రవారం ప్రత్యేక మహాజనసభ సమావేశం నిర్వహించనున్నట్లు సొసైటీ సీఈవో సీహెచ్ లోక్‌నాథ్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో సంఘం లావాదేవీలు, జమ, ఖర్చులు పరిశీలించి ఆమోదిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వరికుంటపాడు, సెప్టెంబరు 11: మండలంలోని జడదేవి, తూర్పుచెన్నంపల్లి, తూర్పుబోయమడగల, కనియంపాడు గ్రామాల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఖుద్దూస్‌బాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని త్రీఫేజ్ సౌకర్యం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఏర్పడుతున్న అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

శిక్షణ కేంద్రం పరిశీలన

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 11: స్థానిక కరీమావీధిలోని ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని జి ల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని కంప్యూటర్లు, గ్రంథాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. రాపూరు, నెల్లూరు, ఉదయగిరి పట్టణాల్లో ఉర్దూ అకాడమీ గ్రంథాలయాలు ఉన్నాయన్నారు. ఆయా గ్రంథాయాల్లో ఈ ఏడాది నుంచి ప్రభుత్వం మైనార్టీ యువతకు కంప్యూటర్‌పై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిం చాలని నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా ఆయా కేంద్రాల్లోని కంప్యూ టర్లు, పుస్తకాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పని చేయని కంప్యూటర్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తామన్నారు.

రేపు హుండీల లెక్కింపు

వలేటివారిపాలెం. సెప్టెంబరు 11: మండలంలోని మాలకొండ ఆలయంలోని కల్యాణ మండ పంలో శుక్రవారం ఉదయం హుండీల లెక్కింపు ప్రారంభమవుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 శనివారాలకు 37 హుండీల ద్వారా వచ్చిన కానుకలను లెక్కించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కనిగిరి రిజర్వాయర్ ఖాళీ

- అడుగంటిన జలాలు
- ఆందోళనలో అన్నదాతలు



ఎండిపోయి ఎడారిని తలపిస్తున్న కనిగిరి రిజర్వాయర్

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 11: కోవూరు, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల పరిధిలోని 10 మండలాల్లో అధికారిక, అనధికారికంగా సుమారు 3లక్షల ఎకరాలకు సాగునీరందించే కనిగిరి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అడుగంటాయి. దీంతో ఆయకట్టు రైతాంగం ఆశలు ఆవిరయ్యాయి. గత రబీసాగు చేతికందివస్తుందో, లేదోననే ఆందోళనలో ఉన్న రైతులను అప్పట్లో మిచౌంగ్ తుఫాను కొంతమేర ఆదుకుంది. ఆ తరువాత నుంచి రిజర్వాయర్‌లో నీటి కొరత కారణంగా ఖరీఫ్‌లో క్రాప్ హాలీడే ప్రకటించారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 3.45 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.09 టీఎంసీలతో తాగు, సాగునీరు అసాధ్యమనే చెప్పాలి. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని ప్రాంతాల రైతులు రబీ సాగుకు నార్లు పోసుకునేందుకు సిద్ధమయ్యారు. సోమశిల జలాలు వస్తేకాని నీటి విడుదల సాధ్యం కాదని అధికారులు చేతులెత్తేశారు.



తుప్పుపట్టి దెబ్బతిన్న కనిగిరి రిజర్వాయర్ కలుజులు

ప్రమాదంలో రిజర్వాయర్

150 ఏళ్ల క్రితం నిర్మించిన కనిగిరి రిజర్వాయర్ కరకట్టలు బలహీనపడ్డాయి. అక్కడక్కడా పగుళ్లిచ్చి గండ్లు పడ్డాయి. వీటికితోడు అన్ని చానళ్ల రెగ్యులేటర్లు దెబ్బతిన్నాయి. పైడేరు ఎస్కేప్ చానల్ పూర్తిస్థాయిలో దెబ్బతిని ప్రమాదపుటంచుల్లో ఉంది. రిజర్వాయర్‌లోని జలాల అలల తాకిడికి కరకట్టల రివిట్‌మెంట్ దెబ్బతింది. సదరన్, ఈస్ట్రన్, పైడేరు ఎస్కేప్ చానల్, ముంబయి మిట్ట కలుజులకు అమర్చిన రెగ్యులేటర్లు, (చక్కలు) స్ట్రక్చర్లు తుప్పుపట్టి దెబ్బతిన్నాయి. రెగ్యులేటర్లు, కరకట్టలను త్వరితగతిన పునరుద్ధరించకపోతే రిజర్వాయర్‌కు పెనుప్రమాదం తప్పదని రైతులు అంటున్నారు. దీనికితోడు రిజర్వాయర్‌లోని ఐలాండ్ తీరం సమీపంలో భారీగా గ్రావెల్ తవ్వకాలతో అక్కడ జలాలు బయటకు ఊరుతున్నాయి. దీంతో ప్రమాదం పొంచి ఉంది. వీటన్నింటిపై పాలకులు, అధికారులు దృష్టిసారించి సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.

వేడుకగా రాధాకృష్ణుల పల్లకీ సేవ



పల్లకీ మోస్తున్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

వెంకటాచలం, సెప్టెంబరు 11: రాధాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాల అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మనోజ్‌గుప్తా, సభ్యులు చల్లా రమణయ్య, పుత్తూరు వెంకటరత్నం, వరదగళ్ల హరిబాబు, మందిపాటి రమేష్ బాబు, గజ్జల శంకరమ్మ తదితరులున్నారు.

గడ్డివామి దగ్ధం



మంటలార్పుతున్న ఎస్ఐ హనీఫ్, ఫైర్ సిబ్బంది

పొదలకూరు, సెప్టెంబరు 11: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మండలంలోని కనుపర్తిపాడు గ్రామంలో బుధవారం ఊరేగింపు జరుగుతుండగా అపశృతి చోటుచేసుకుంది. టపాసులు కాలుస్తుండగా రవ్వలు పడి గడ్డివాము దగ్ధమై మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ హనీఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని వాటర్ ట్యాంకర్ సహాయంతో మంటలను అదుపుచేసేందుకు కృషిచేశారు. నెల్లూరు నుంచి ఫైర్ సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. కాగా, గడ్డివాము దగ్ధం కావడంతో సుమారు రూ.60వేలు నష్టం జరిగినట్లు బాధితుడు మల్లికార్జునరెడ్డి వాపోయాడు.

ఎన్డీఏ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత కాకాణికి లేదు

- జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి



మేము సైతం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జనసేన పార్టీ నాయకులు

వెంకటాచలం, సెప్టెంబరు 11: ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి లేదని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. మండలంలోని సర్వేపల్లిలో బుధవారం మేము సైతం విజయవాడ వరద బాధితులకు అండగా అనే కార్యక్రమాన్ని జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో మిచౌంగ్ తుఫాన్ వంటి ప్రకృతి విపత్తులు వస్తే వాటిని అదునుగా తీసుకొని వైసీపీ నాయకులు ఇష్టానుసరంగా దోచుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. విజయవాడ వరద బాధితులకు నిరంతరం అండగా ఉన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను విమర్శిస్తే వైసీపీ నాయకులు చేసిన అవినీతి, అక్రమాలు, దోపిడీని ఎత్తిచూపాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, బోలా అశోక్, రెహమాన్ తదితరులున్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఐ



మాట్లాడుతున్న సీఐ రవినాయక్

ముత్తుకూరు, సెప్టెంబరు 11: అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కృష్ణపట్నం సీఐ రవినాయక్ సూచించారు. ముత్తుకూరులోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు, ఉద్యోగులు వస్తున్నారని, ఇదే ముసుగులో గుర్తుతెలియని వ్యక్తులు, నేరస్తులు ఈప్రాంతంలో సంచరించేందుకు అవకాశాలు ఉన్నాయని, అందువల్ల అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కాగా, మండలంలో మూడు ప్రాంతాలను గుర్తించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినాయక నిమజ్జనాలు పూర్తిచేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య, శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి పెట్టామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాథరెడ్డి, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక, గ్రావెల్ తరలింపు

- ఎమ్మెల్యే చెప్పారని విస్తృత ప్రచారం? ● పోలీసులు వస్తున్నారని జంప్



ట్రాక్టర్‌కు ఎర్రమట్టి లోడు చేస్తున్న ఎక్సకవేటర్

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 11: పోలినాయుడు చెరువు, పురంధరపురం, మినగల్లు, జొన్నవాడ, దామరమడుగు నుంచి ఇసుక, మట్టి, గ్రావెల్‌ను ఇంటి దొంగలే విచ్చలవిడిగా తరలిస్తున్నారని సొంత పార్టీలోనే చర్చనీయాంశమైంది. గత నెలా 15 రోజులుగా పురంధరపురం పరిధిలోని కనిగిరి రిజర్వాయర్‌లో గ్రావెల్ తరలింపునకు ఎమ్మెల్యే చెప్పినట్టు ప్రచారం నడుస్తోంది. మినగల్లు, జొన్నవాడ, దామరమడుగులోని పెన్నానదిలో నుంచి ఇసుక, పోలినాయుడు చెరువు గిరిజన కాలనీకి సమీపంలో ప్రభుత్వ భూమిలో నుంచి ఎర్రమట్టిని అర్థరాత్రి నుంచి వేకువజాము వరకు తరలించారు. స్థానికంగా ప్రశ్నించిన వారికి తహసీల్దారు, సీఐ ఎవరికీ ఇబ్బందులు లేకుండా తేలుకోమని చెప్పారని ప్రచారం చేస్తున్నారు. ఇంతలోనే పోలీసులు వస్తున్నారని తెలిసి యంత్రాలు వదిలేసి పరారవడం గమనార్హం.

వరద బాధితులకు ఆర్థిక సాయం

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 11: విజయవాడ వరదబాధితులను ఆదుకునేందుకు రూ. 7కోట్ల70లక్షల ఆర్థిక సాయం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అందించామని సర్పంచుల సంఘం నేతలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి గోపిరెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం విలుకానిపల్లిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు ఒకనెల గౌరవ వేతనం సీఎం సహాయనిధికి జమచేయవలసిందిగా అంగీకార పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును వ్యతిరేకించం : బీటీఏ

రాపూరు, సెప్టెంబరు 11: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును తాము వ్యతిరేకించమని బీటీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి డి మాల్యాద్రి, జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు తెలిపారు. బుధవారం వీరు సంఘం సభ్యత్వ నమోదులో భాగంగా కండలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. సమాజంలో అసమానతలు తొలగించేందుకే సుప్రీంకోర్టు ఈచర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, ట్రెజరర్ షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడి గ్రామోత్సవం

పొదలకూరు, సెప్టెంబరు 11: పట్టణంలోని బాలాజీ నగర్ మొదటి వీధిలో ఏర్పాటుచేసిన వినాయకుడిని బుధవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం లడ్డు వేలంపాట నిర్వహించగా రామ్‌నగర్‌కు చెందిన మన్నెం శ్యాంప్రసాద్‌నాయుడు రూ.30వేలకు కైవసం చేసుకున్నాడు. అనంతరం వినాయక నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు అదాల మురళీరెడ్డి, బాలాజీనగర్ యూత్, తదితరులు పాల్గొన్నారు.

●**బుచ్చిరెడ్డిపాళెం:** రామకృష్ణానగర్, బేల్దారిపాళెం, సుబ్బారెడ్డి నగర్ తదితర ప్రాంతాలు, గ్రామాల్లో ఉట్టి మహోత్సవాలు, గ్రామోత్సవాలు చేశారు. కనిగిరి రిజర్వాయర్ కాలువలు, సదరన్ ఛానల్, అల్లూరు కాలువ, జొన్నవాడ పెన్నా నదిలో వినాయక నిమజ్జనోత్సవాలు నిర్వహించారు.

రాయితీపై నవధాన్యాల విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న రాజ్‌కుమార్

ముత్తుకూరు, సెప్టెంబరు 11: నవధాన్యాలతో భూమికి తగిన పోషకాలు లభిస్తాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్ తెలిపారు. పంటపాలెం, నారికేళపల్లిలో బుధవారం వరి, వేరుశనగ పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిఎద్దడి కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువులుగా పొలంలో విత్తుకునేందుకు నవధాన్యాలను రైతులకు ప్రభుత్వం రాయితీతో అందిస్తోందన్నారు. సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు రాయితీపై నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జోత్స్నారాణి, శాస్త్రవేత్త సురేఖదేవి, వ్యవసాయ సహాయకులు హసీనా, తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు సిటీ, రూరల్

కోవూరు, సర్వేపల్లి







భక్తోత్సాహం

వినాయక నిమజ్జనోత్సవం బుధవారం నగరంలో ఘనంగా జరిగింది. స్వర్ణాల చెరువులోని గణేష్ ఘాట్‌లో సామూహిక వినాయక నిమజ్జనాన్ని శోభాయాత్ర, వివిధ ఆలయాల ప్రసాదాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జాతరలా నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గజ వాహనంపై వినాయకుడి విహారం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 11 : నగరంలోని పురమందిరం ప్రాంగణంలో ఉన్న జ్యోతి వినాయకస్వామి ఆలయంలో చవితి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గజ వాహనంపై జ్యోతి వినాయక స్వామి నగరోత్సవం జరిగింది. ఉదయం మూలవర్లకు కుంకుమ అలంకారం ఆకట్టుకుంది. ఈ ఉత్సవాలను ధర్మకర్తలు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.

న్యూ జర్నలిస్టు కాలనీలో చోరీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 11: కొత్తూరు సమీపంలోని న్యూ జర్నలిస్టుకాలనీలో మంగళవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. స్థానికులు కేకలు వేయడంతో నిందితులు వారి స్కూటీని అక్కడే వదిలివేసి పరారయ్యారు. సేకరించిన సమాచారం మేరకు.. కొత్తూరులోని న్యూ జర్నలిస్టు కాలనీలో నరసారెడ్డి కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన నెల రోజుల కిందట కుటుంబంతో కలిసి అమెరికాకు వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ముగ్గురు దుండగులు స్కూటీపై అతని నివాసం వద్దకు చేరుకున్నారు. ఇంటికి తాళాలు వేసి ఉండటం గమనించి ప్రహరీ దూకి ఇంట్లోకి ప్రవేశించి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో లైట్లు వెలగడాన్ని పై పోర్షన్‌లో నివాసం ఉంటున్న వారు, స్థానికులు గమనించి ఎవ్వరంటూ పెద్దగా కేకలు వేయడంతో నిందితులు గోడదూకి పారారయ్యారు. ఆ సమయంలో నిందితులు వారి స్కూటీతో పాటు చోరీ చేసిన ల్యాప్‌టాప్, మరి కొన్ని వస్తువులను అక్కడే పడివేశారు. ఈ ఘటనపై స్థానికులు వేదాయపాలెం పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఘటనాస్థలానికి స్థానిక ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. దొంగతనంకు గురైన సొత్తు ఎంత అనేది ఇంకా స్పష్టత రాలేదు. పోలీసులు స్కూటీ రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

కూలీల సంఖ్య పెంచండి : ఎంపీడీవో

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 11 : గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని రూరల్ మండలం ఇన్‌చార్జి ఎంపీడీవో వీ శైలేంద్రకుమార్ సూచించారు. బుధవారం కొండ్లపూడిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం తీరును ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో అవసరాల ఆధారంగా పనులు పెంచుకుంటూపోవాలన్నారు. నిర్వహణలో ఎలాంటి అజాగ్రత్త జరిగిన ఫీల్డ్ సహాయకులదే బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రఘు, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రోగికి రూ.5వేల సాయం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 11 : డయాలసిస్ కోసం నారాయణ ఆసుపత్రిలో చేరిన నిరుపేద షేక్.అక్బర్‌కి భారత్ సేవా ఫౌండేషన్ నిర్వాహకులు డయాలసిస్‌కు అయ్యే ఖర్చును భరిస్తామని ఆసుపత్రి వైద్యుడు ప్రవీణ్‌కి చెప్పి బుధవారం చికిత్స చేయించారు. ఈ మేరకు కుట్టి కళాశాలల వ్యవస్థాపక అధ్యక్షుడు లతీఫ్‌కుట్టి, భారత్ సేవా ఫౌండేషన్ సభ్యులు షేక్.ఖాసిం, ఖాజామొహిద్దీన్, కొమ్మల కృష్ణయ్య, కుసుమకుమారి ముందుకు వచ్చి ముందుగా రూ.5వేలు అందజేశారు.

విద్యుత్ సమస్యలు పరిష్కారం

- టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, సెప్టెంబరు 11 : నెల్లూరురూరల్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం 41వ డివిజన్ పరిధిలోని పరమేశ్వరినగర్‌లో నూతన పోల్స్, ఉయ్యాలకాలువకట్ట వద్ద నూతన ట్రాన్స్‌ఫార్మర్లను మాజీ మేయర్ భానుశ్రీతో కలిసి ఆయన ప్రారంభించారు. విద్యుత్ శాఖనుంచి పూర్తి స్థాయి సేవలు ప్రజలకు దగ్గర చేసేందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, రామకృష్ణ, సురేష్, వెంకటేశ్వర్లు, వీరాచారిలు పాల్గొన్నారు.

వీళ్లు ఇక మారరా!?

- డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ ● సచివాలయం మూత
- ప్రత్యేక అధికారులను నియమించినా రానిమార్పు



మంగళవారం ఉదయం 10.30 గంటలకు మూసి ఉన్న హరనాథపురం సచివాలయం

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 11 : ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగంగా అందించాలన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. ఈ వ్యవస్థ నెల్లూరులో నిర్లక్ష్యానికి నిలువెత్తు తరహాలో పనిచేస్తోంది. కమిషనర్ సూర్యతేజ ఆకస్మిక తనిఖీలకు వెళ్తే సచివాలయానికి తాళం వేసి వెళ్లిపోయారు. దీంతో ఆకస్మికంగా తనిఖీలు చేయాలని నిర్ణయించిన ఆయన ప్రత్యేక అధికారులను నియమించారు. ఇందులో భాగంగా మంగళవారం డిప్యూటీ కమిషనర్ చెన్నుడు ఉదయం 10.30 గంటలకు ఆకస్మికంగా హరనాథపురంలోని మూడవ వీధిలో ఉన్న సచివాలయం వద్దకు వెళ్లారు. పని వేళలు ప్రారంభమైనా సచివాలయం మాత్రం తెరుచుకోలేదు. కొద్దిసేపటి వరకు చూసిన ఆయన చేసేదేమిలేక వెనుదిరిగారు. ఇలా నెల్లూరులోని సచివాలయాలు సమయానికి తెరుచుకోనివి కొన్నయితే మధ్యాహ్నానికే మూతపడుతున్నవి మరికొన్ని. వీళ్లు ఇక మారరా అంటూ సచివాలయ సిబ్బందిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎడిఫై స్కూల్ విద్యార్థికి

గిన్నిస్‌బుక్ వరల్డ్ రికార్డ్

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 11 : నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న ఎడిఫై పాఠశాల విద్యార్థి పసుపులేటి మోక్షిత నాయుడు గిన్నిస్‌బుక్ వరల్డ్‌రికార్డు సాధించారని పాఠశాల డైరెక్టర్ నరేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాశీలో ఇటీవల జరిగిన ఐసీఎండీఏలో కూచిపూడి నృత్యం సీనియర్ విభాగంలో అద్భుత నాట్య ప్రదర్శన చేసి గిన్నిస్‌బుక్ రికార్డు సాధించారన్నారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులు ఝాన్సీ, సునీల్‌బాబులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సునీత, ఇన్‌చార్జి ప్రసన్న, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

వచ్చే నెలలో పండ్ల మార్కెట్

హమాలీల నగర మహాసభలు

- సీపీఎం ప్రదర్శన, జెండా ఆవిష్కరణ



చిన్నబజారులో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 11 : పండ్ల మార్కెట్ సీపీఎం హమాలీల నగర మహాసభలు అక్టోబరు 20, 21వ తేదీలలో నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో జరుగుతాయని సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం నగరంలోని చిన్నబజార్ ప్రాంతంలో ప్రదర్శన నిర్వహించారు. అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రూ.6వేల పింఛన్లు అమలు చేయాలన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించేలా చట్టాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కత్తి శ్రీనివాసులు, అత్తిమూరు శ్రీనివాసులు, నరసింహ, పండ్ల మార్కెట్ కార్యదర్శి జమ్ముల శ్రీనివాసులు, సౌందర్‌రాజన్, మాల్యాద్రి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు వెళ్లిన కార్మికులకు వసతులు కల్పించాలి

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 11 : విజయవాడలో వరద బాధితుల సేవకు నెల్లూరు నుంచి వెళ్లిన పారిశుధ్య కార్మికులకు వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికుల ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బుధవారం కార్పొరేషన్ ఎదుట ఆందోళన చేశారు. యూనియన్ నేత పెంచలనరసయ్య మాట్లాడుతూ 10 రోజులుగా నెల్లూరు కార్మికులు విజయవాడలో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. వారికి మాస్కులు, గ్లౌజులు, బూట్లు, ఆహారం, వసతితో పాటు మెరుగైన సౌకర్యాలు అందచేయాలన్నారు. అక్కడ కార్మికులను కొందరు అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిన్నెర కుమార్, కామక్షమ్మ, సునీల్, వజ్రమ్మ, శీను పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

గురువారం 12 సెప్టెంబరు 2024



తిరుపతి ప్రేక్షకులకు థ్యాంక్స్

నివేదా థామస్

'35 చిన్న కథ కాదు' సినిమాను ఆదరించిన తిరుపతి ప్రేక్షకులకు హీరోయిన్ నివేదా థామస్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం రాత్రి హీరో విశ్వదేవ్, అసిస్టెంట్ డైరెక్టర్ హరిహర్ష తదితరులతో కలసి తిరుపతిలోని కృష్ణతేజ థియేటర్‌ను ఆమె సందర్శించారు. కాసేపు ప్రేక్షకుల మధ్య సినిమాను వీక్షించారు.తిరుపతి జిల్లా పరిసర ప్రాంతాల్లోనే '35చిన్న కథ కాదు' షూటింగ్ జరిగిందని గుర్తు చేసుకున్న ఆమె చిన్న సినిమా అయినా గొప్పగా ఆదరించారని కొనియాడారు.ప్రేక్షకుల ప్రోత్సాహం ఇలాగే కొనసాగాలని కోరారు.

- తిరుపతి అర్బన్

ఆర్టీసీ జోన్ 4 ఈడీగా చెంగల్‌రెడ్డి



తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 11: ఆర్టీసీ కడప జోన్ 4 ఫుల్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా తిమ్మాడి చెంగల్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ స్థానంలో ఉన్న గిడుగు వెంకటేశ్వర్లు రెండు నెలల క్రితం బదిలీ అయిన విషయం తెలిసిందే.తిరుపతి జిల్లా ప్రజారవాణాధికారిగా వున్న టి.చెంగల్‌రెడ్డిని ఫుల్‌చార్జ్ ఈడీగా నియమిస్తూ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు.రాయలసీమ పరిధిలోని తిరుపతి, చిత్తూరు,కడప, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లాలకు ఆయన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు.

ఏపీఆర్‌సెట్ అడ్మిషన్ల కన్వీనర్‌గా పీసీ వెంకటేశ్వర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11: ఏపీఆర్‌సెట్ అడ్మిషన్ల కన్వీనర్‌గా ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఎస్వీయూ ఓఆర్ఐ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు గతంలో ఏపీఆర్‌సెట్ కో-కన్వీనర్‌గా వ్యవహచించారు. ఈ క్రమంలో ఏపీఆర్‌సెట్ అడ్మిషన్ల కన్వీనర్‌గా నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఏపీఆర్‌సెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడించారు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ నుంచీ ఏపీఆర్‌సెట్ తొలి దశ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ నెలాఖరులోపై తొలి దశ అడ్మిషన్లు పూర్తి చేయాలని నిర్ణయించినట్టు ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు వెల్లడించారు.



22 కిలోల గంజాయి స్వాధీనం ఓజీ కుప్పంవాసి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 11: గంజాయి రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని తిరుపతి ఈస్ట్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి అతడి వద్ద 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.తిరుపతి ఈస్ట్ పరిధిలో గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగంపై సీఐ మహేశ్వర రెడ్డి ఇటీవల ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తపల్లి రోడ్డు క్రాస్ వద్ద గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతంలో మాటు వేసిన పోలీసులు నగరి మండలం ఓజీ కుప్పం గ్రామానికి చెందిన సత్తుపల్లి శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని అతని వద్ద 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.తిరుపతి మారుతీనగర్‌లో కాపురముంటున్న శ్రీనివాసులు కిలో గంజాయిని రూ.10,000కు కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా మార్చి తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో ప్యాకెట్ రూ.300 లెక్కన అమ్ముతున్నట్లు విచారణలో బయటపడింది.

వరద బాధితులకు పెరుగుతున్న సాయం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితులకు వివిధ వర్గాలనుంచీ ఆర్థిక సాయం అందుతోంది.వ్యవసాయ శాఖ ఉద్యోగులు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని బుధవారం కలెక్టర్‌కు అందజేశారు.అలాగే గృహనిర్మాణశాఖ ఉద్యోగులు మరో లక్ష రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధికి కలెక్టర్‌కు అందజేశారు. డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ రూ.23 వేలను, హెడ్ కానిస్టేబుల్ జి. శంకర్ రెడ్డి రూ.20వేలను సీఎం సహాయ నిధికి అందజేశారు.



కలెక్టర్‌కు విరాళం అందజేస్తున్న వ్యవసాయాధికారి ప్రసాదరావు

పోలీసులకు తలనొప్పిగా

సత్యవేడు ఎమ్మెల్యే కేసు



- అటు దళిత ఎమ్మెల్యే.... ఇటు టీడీపీ మహిళా నేత
- హోటల్‌కు రాకపోకలపై ప్రాథమిక ఆధారాలు లభ్యం
- ఫోన్ కాల్ డేటా సేకరణపై దృష్టి -అనివార్యంగా కుట్ర కోణంపైనా దర్యాప్తు

తిరుపతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అటు చూస్తే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్నది అధికార పార్టీకి చెందిన దళిత ఎమ్మెల్యే... ఇటు చూస్తే ఆరోపణలు చేసింది అదే అధికార పార్టీకి చెందిన మహిళా నేత... ఆరోపణలు చేస్తున్నది, ఎదుర్కొంటున్నది ఇరువురూ సమాజంలో అణచివేత ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన వారే... ఎలా చూసినా సున్నిత వ్యవహారం కావడంతో సత్యవేడు ఎమ్మెల్యేపై నమోదైన కేసు పోలీసు వర్గాలకు తలనొప్పిగా మారింది. దీంతో నిష్పాక్షిక దర్యాప్తుతోనే ఒత్తిడులను అధిగమించాలని, తద్వారా ప్రభుత్వాన్ని ఎవరూ తప్పుపట్టే అవకాశం లేకుండా చేయాలని జిల్లా పోలీసు అధికారులు భావిస్తున్నారు. గత గురువారం అర్ధరాత్రి కేవీబీపురం మండలానికి చెందిన ఓ తెలుగు మహిళ నాయకురాలు ఇచ్చిన ఫిర్యాదుతో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. అయితే ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసిన మహిళే ఈ కేసు విచారణకు సహకరించకపోతుండడం పోలీసు అధికారులకు సమస్యగా మారుతోంది. మరోవైపు ఫిర్యాది, నిందితుడు అధికార పార్టీకి చెందిన వారే కావడంతో కేసు దర్యాప్తు నిష్పాక్షికంగా జరుగుతుందా లేదా అన్నది ఇపుడు అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు సామాన్య ప్రజానీకంలోనూ చర్చనీయాంశంగా మారుతోంది.

మొబైల్ ఫోన్ కాల్ డేటాయే కీలకం

కేసును ఎంతోకొంత పరిష్కరించగలిగిన ఆధారాల్లో కీలకమైంది మొబైల్ ఫోన్ కాల్ డేటా. దీంతో పోలీసులు ఎమ్మెల్యే ఫోన్, బాధిత మహిళ వినియోగిస్తున్న రెండు ఫోన్లు, ఆమె భర్త ఫోన్లకు సంబంధించిన కాల్ డేటాపై దృష్టి సారించారు. బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొన్న జూలై 6, 17 తేదీలతో పాటు ఆగస్టు 10వ తేదీ.. ఈ మూడు రోజుల్లో వీరి ఫోన్ల నుంచీ ఎవరెవరికి కాల్స్ వెళ్ళాయి? ఎవరెవరి నుంచీ కాల్స్ వచ్చాయి? ఎమ్మెల్యే, బాధిత మహిళల్లో ఎవరు ఎన్ని సార్లు ఎదుటి వారికి కాల్ చేశారు? అనే వివరాలు సేకరించే పనిలో పడ్డారు. అదే విధంగా ఆయా తేదీలకు అటూఇటూ పది రోజుల కాల్ డేటా కూడా సేకరిస్తున్నారు. ఎమ్మెల్యేపై ఆరోపణలు, ఫిర్యాదు వెనుక కుట్ర ఏమైనా వుందా అన్న కోణంలో కూడా దర్యాప్తు అనివార్యం కానుంది. అందుకే బాధిత మహిళకు, ఆమె భర్తకు ఘటన జరిగిన మూడు రోజులకు ముందు వెనుక రోజుల్లో ఎవరెవరి కాల్స్ వచ్చాయి? వీరి నుంచీ ఎవరెవరికి కాల్స్ వెళ్ళాయి? అన్నది కూడా విశ్లేషించనున్నారు.

సీసీ ఫుటేజీల సేకరణ

తిరుపతి భీమాస్ ప్యారడైజ్ హోటల్‌కు ఎమ్మెల్యే పిలుపుపై మూడు సార్లు వెళ్ళినట్టు బాధిత మహిళ ఫిర్యాదులో తెలిపిన మేరకు ఆ హోటల్‌లో సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు సేకరించారు. అయితే హోటల్‌లో సీసీ కెమెరాలు రికార్డు చేసే ఫుటేజీలు స్టోర్ అయ్యే హార్డు డిస్కు నుంచీ సంబంధిత రోజువారీ డేటా నెల రోజుల పాటు మాత్రమే వుంటుందని, అటు తర్వాత ఆటోమేటిగ్గా ఎరేజ్ అయ్యేలా సెట్టింగ్స్ పెట్టడంతో జూలై నెల 6, 17 తేదీల ఫుటేజీలు లభ్యం కాలేదని తెలిసింది. ఆగస్టు 10వ తేదీ ఫుటేజీలు మాత్రం దొరికాయని చెబుతున్నారు. అందులో ముందుగా ఎమ్మెల్యే ఆదిమూలం హోటల్‌కు రావడం, ఆ తర్వాత బాధిత మహిళ రావడం రికార్డయిందని సమాచారం. బాధిత మహిళ హోటల్ లోపలికి వెళ్ళాక గది వద్దకు, రిసెప్షన్ వద్దకు రెండు సార్లు అటూ ఇటూ తిరిగిన దృశ్యాలు రికార్డయినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. సీసీ కెమెరాల హార్డ్ డిస్కును స్వాధీనం చేసుకున్న పోలీసులు దాని విశ్లేషణకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్టు సమాచారం.

సీసీ కెమెరా ఫుటేజీలతో ప్రయోజనం పరిమితమేనా?

దర్యాప్తులో సాంకేతికంగా ఒక దశ వరకూ మాత్రమే ఆధారాలు సేకరించగలమని, అంతకు మించి కేసులోని వ్యక్తుల ఉద్దేశాల విషయంలో తాము చేయగలిగిందేమీ లేదన్నది పోలీసు అధికారుల భావనగా తెలుస్తోంది. సీసీ కెమెరా ఫుటేజీలతో దర్యాప్తులో పరిమితంగానే ప్రయోజనం వుంటుంది తప్ప కేసు పరిష్కారానికి పెద్దగా ఉపయోగపడదని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. బాధిత మహిళను ఎమ్మెల్యే బెదిరించిన వీడియోలు కానీ లేదా ఆడియో రికార్డులు కానీ ఇప్పటి వరకూ బాధిత మహిళ పోలీసులకు ఆధారాలు ఇవ్వలేదని సమాచారం. అలాగే అసభ్యకరంగా లేదా బెదిరింపులతో కూడిన వాట్సాప్ మెసేజీలు కానీ ఎస్ఎంఎస్‌లు కానీ పెట్టినట్టు కూడా ఆధారాలు అందజేయలేదు.అలాంటి ఆధారాలు వున్నాయో లేదో కూడా బాధిత మహిళ పోలీసులకు వెల్లడించలేదు. అలాంటివి వుంటే ఆరోపణలకు అదనపు బలం కలిగించడంతో పాటు నేర నిరూపణ సులువయ్యేదని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న విధంగా ఎమ్మెల్యే, బాధిత మహిళ ఆగస్టు 10న హోటల్‌కు వచ్చినట్టు ఆధారాలు లభించినా నేరాన్ని నిరూపించలేవన్నది వారి భావనగా వుంది. బాధిత మహిళ తనే రికార్డు చేసినట్టుగా చెబుతున్న వీడియోలో ఎమ్మెల్యే బెదిరించడం లేదా దౌర్జన్యంగా వ్యవహరించడం, అత్యాచారం చేసినట్టుగా దృశ్యాలు వుంటే దర్యాప్తు ఒక కొలిక్కి చేరినట్టే. అయితే అలాంటి దృశ్యాలు అందులో వున్నాయో లేదో దర్యాప్తులో తేలాల్సి వుంది. కాగా హోటల్‌లో ఆ మూడు తేదీల్లో గదులు ఎవరు బుక్ చేశారు? ఎవరి పేరిట బుక్ చేశారు? అన్నది కూడా పోలీసులు విచారిస్తున్నారు. ఘటన జరిగినట్టు చెబుతున్న తిరుపతి భీమాస్ ప్యారడైజ్ హోటల్ సిబ్బంది సాక్ష్యం కూడా కీలకం కానుంది. పోలీసు విచారణలో వారు వెల్లడించే అంశాలు దర్యాప్తుకు ఉపకరించే అవకాశముంది. బాధిత మహిళ చెబుతున్న తేదీల్లో గదుల్లోకి ముందుగా ఎవరు వెళ్ళారు? ఆయా సందర్భాల్లో బాధిత మహిళ తీరు ఎలా కనిపించింది? గదుల్లో పరిస్థితి అసాధారణంగా అనిపించింది ఏదైనా వుందా? అన్న సమాచారం రిసెప్షన్ సిబ్బంది, రూమ్ సర్వీస్ సిబ్బంది నుంచీ పోలీసులు సేకరించాల్సి వుంది.

ఎమ్మెల్యేని విచారించేది ఎపుడు?

గుండె సంబంధ సమస్యలతో చెన్నై అపోలో ఆస్పత్రిలో చేరిన ఎమ్మెల్యే ఆదిమూలం ఎపుడు డిశ్చార్జి అవుతారో తెలియని పరిస్థితి. ఆస్పత్రి నుంచీ డిశ్చార్జి అయితే తప్ప పోలీసులు ఆయన్ను ప్రశ్నించడం వీలు కాదు. అప్పుడు కూడా వైద్యుల సూచనలు కీలకం కానున్నాయి. గుండె సంబంధ సమస్యలు వున్నప్పుడు ఇబ్బంది పెట్టే ప్రశ్నలు వేయవద్దని వైద్యులు ఓ గడువు వరకూ సూచించే అవకాశమున్నట్టు పోలీసు అధికారులు చెబుతున్నారు. దళిత వర్గానికి చెందిన ఎమ్మెల్యే కావడంతో ఏమి జరిగితే అది ఏ మలుపు తీసుకుంటుందోనని ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోందని దర్యాప్తు అధికారులు వాపోతున్నారు. ఇప్పటికే ఆదిమూలానికి మద్దతుగా టీడీపీలోనూ,వెలుపలా కూడా దళిత వర్గాలు ఆందోళన మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. ఆయనను పోలీసులు అరెస్టు చేయాలన్నా స్పీకరు అనుమతి తీసుకోవాల్సి వుంటుందని సమాచారం.అలాగని విచారణను సాగదీయడానికి కూడా వీల్లేని పరిస్థితి. అధికార పార్టీకే చెందిన మహిళా నేత తనపై లైంగిక వేధింపులకు, అత్యాచారానికి పాల్పడ్డారని చేసిన ఫిర్యాదు కావడంతో ఆ కోణంలోనూ దీన్ని నిర్లక్ష్యం చేసే పరిస్థితి లేదు. మరోవైపు ప్రభుత్వ, అధికార పార్టీ ప్రతిష్టలతో ముడిపడిన వ్యవహారం. ఈ కారణాలతో సాధ్యమైనంత త్వరగా విచారణ ముగించి వాస్తవాలను బయటపెట్టి తాము ఒత్తిడి నుంచీ బయటపడాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

వైద్య పరీక్షలకు, విచారణకు సహకరించని ఫిర్యాది

ప్రభుత్వ ప్రతిష్టతో ముడిపడిన అంశం కావడంతో తిరుపతి పోలీసులు సత్యవేడు ఎమ్మెల్యేపై నమోదు చేసిన కేసులో దర్యాప్తును వేగంగా మొదలుపెట్టారు. గత గురువారం అర్ధరాత్రి కేసు నమోదు కాగానే శుక్రవారం ఉదయాన్నే బాధితురాలిని వైద్య పరీక్షల కోసం రుయాస్పత్రికి తరలించారు. అయితే ఆమె వైద్య పరీక్షలకు అంగీకరించకపోవడంతో లిఖితపూర్వకంగా రాయించుకుని పంపివేశారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. చట్టప్రకారం వైద్యపరీక్షలు నిర్వహించాల్సి వున్నందున పోలీసులు బాధితురాలి వెంటబడుతున్నారు. ఆ క్రమంలో సోమవారం ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధిత మహిళ వైద్య పరీక్షలు అవసరం లేదని మొండికేసినట్టు సమాచారం. తనను విచారించడం మాని ముందు ఎమ్మెల్యేని అరెస్టు చేసి విచారించాలంటూ ఆమె డిమాండ్ చేసినట్టు తెలిసింది. దీంతో మరోసారి ఆమెతో ఆ మేరకు స్టేట్‌మెంట్ రాయించుకుని పంపించేసినట్టు పోలీసులు చెబుతున్నారు. వాస్తవానికి వైద్యపరంగా చూస్తే ఈ పరీక్షలతో పెద్దగా తేలేది కూడా ఏమీ వుండదని అటు పోలీసులు, ఇటు వైద్యులు కూడా భావిస్తున్నారు. ఎందుకంటే అత్యాచారం జరిగిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహిస్తే పలు ఆధారాలు లభ్యమవుతాయి. దుస్తులపై వీర్యపు ఆనవాళ్ళు, బాధితురాలి దేహంపై ఏవైనా గాయాలు వంటివి వుంటే ఆ మేరకు బలమైన ఆధారాలు లభించేవి. సంబంధిత హోటల్ గదిలోని బెడ్డు, బెడ్ షీట్, టవల్ వంటివి కూడా సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాల్సి వుండేది. వాటి ద్వారా కూడా కొన్ని ఆధారాలు దొరికేవి. గత నెల 10వ తేదీన జరిగిన ఘటనపై పాతిక రోజుల తర్వాత ఫిర్యాదు చేయడం వల్ల ఆ అవకాశం లేకుండా పోయింది. బాధిత మహిళ వైద్య పరీక్షలకు ఎందుకు నిరాకరిస్తున్నారన్నది పోలీసులకు అంతుబట్టడం లేదు.

సత్యవేడులో రాజకీయ నిశ్శబ్దం

ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడం, ఆయనపై పోలీసులు కేసు నమోదు చేయడం వంటి సంచలనాత్మక ఘటనలు జరిగినప్పటికీ నియోజకవర్గంలో రాజకీయంగా మాత్రం నిశ్శబ్దకర వాతావరణమే కనిపిస్తోంది. నియోజకవర్గ టీడీపీలో సైతం దళిత వర్గాలు మినహా మిగిలిన వర్గాలు ఎమ్మెల్యేకు మద్దతుగా ముందుకు రావడంలేదు. అదే సమయంలో ఆయనకు వ్యతిరేకంగానూ ఎలాంటి కార్యక్రమాలూ జరగకపోవడం గమనార్హం. ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, చివరికి విపక్షమైన వైసీపీ వర్గాలు సైతం ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఆందోళనలకు దిగకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కాగా బాధిత మహిళకు కూడా ఎవరూ మద్దతుగా నిలవకపోవడం చర్చనీయాంశంగా మారుతోంది. ఈ నేపథ్యంలో తనపై లైంగిక వేధింపుల కేసును కొట్టివేయాలని కోరుతూ ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించారు.తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలు శోధించకుండా పోలీసులు నేరుగా కేసు నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్న ఆయన ఈ మొత్తం ఘటన ఓ హనీ ట్రాప్ అని తెలిపారు.

ఎస్పీడీసీఎల్‌లో పదోన్నతులు

తిరుపతి (ఆటోనగర్) సెప్టెంబరు11:ఎస్పీడీసీఎల్‌లో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ సీఎండీ కె.సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సదరన్ డిస్కం జాయింట్ సెక్రటరీ రాధాజయశ్రీ పదవీ విరమణ చేయడంతో జనరల్ మేనేజరుగా వున్న ఎం.గోపాలకృష్ణను ఆ స్థానంలో నియమించారు. కార్పొరేట్ కార్యాలయంలో డీజీఎంగా వున్న ప్రసాద్‌కు జీఎంగా పదోన్నతి కల్పించారు. అలాగే తిరుపతి సర్కిల్ కార్యాలయంలో పర్సనల్ ఆఫీసర్‌గా వున్న శ్రీధర్‌కు డీజీఎంగా,తాత్కాలికంగా పీఓగా పనిచేస్తున్న జీవీఎస్ఆర్ మూర్తిని డీజీఎంగా రెగ్యులర్ చేశారు.

ఆర్టీసీ బస్సుల్లో రూ.10 నాణెం స్వీకరించాల్సిందే

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 11: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల నుంచి 10రూపాయల నాణేలను స్వీకరించాల్సిందేనని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మధ్య కాలంలో పదిరూపాయల నాణేలను చలామణి కావడం లేదంటూ కొందరు కండక్టర్లు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని ప్రయాణికుల నుంచి ఆర్టీసీ యాజమాన్యానికి ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో ఆర్బీఐ విడుదల చేసిన 14రకాల రూ. 10నాణేలను ప్రయాణికులు ఇచ్చినప్పుడు స్వీకరించాలని ఆపరేషన్ ఈడీ ఆదేశాలు జారీచేశారు.ఆయా డిపోల మేనేజర్లు తమ పరిధిలోని డ్రైవర్లు, కండక్టర్లకు బుధవారం ఆదేశాలిచ్చారు. అలాగే బస్టాండుల్లో ఉన్న దుకాణాలకు కూడా ఈ ఆదేశాలు వర్తిస్తాయని తెలియజేశారు.

కలెక్టర్ ఫిజిక్స్ పాఠాలు

రేణిగుంట, సెప్టెంబరు 11: రేణిగుంటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు.తరగతి గదిలో విద్యార్థినుల నడుమ కూర్చుని ఉపాధ్యాయురాలు బోధిస్తున్న భౌతికశాస్త్రం పాఠాలను ఆసక్తిగా ఆలకించారు.అనంతరం ఆయనే టీచర్‌గా మారి భౌతికశాస్త్రంలోని పలు అంశాలను విద్యార్థులకు బోధించారు. వారిని ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం కింద జిల్లాలో ఎంపికైన 40 పాఠశాలల్లో రేణిగుంట జడ్పీ బాలికల హైస్కూలు ఒకటన్నారు.ఈ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు, నాణ్యమైన విద్యకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. రేణిగుంట మండలంలో ప్రభుత్వ భూముల కబ్జాలతో పాటు ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాపై ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు.జాయింట్ కలెక్టర్ త్వరలోనే విచారణ జరుపుతారన్నారు. ఆర్.మల్లవరం ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి త్వరలో చర్యలు చేపడతామన్నారు.ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధిని, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్, డీఈ బాలాజీ, కేవీకే రాస్ హెడ్ డాక్టర్ శ్రీనివాస్, ఎంఈవో ఇంద్రాణి, సర్వశిక్ష ప్లానింగ్ అధికారి రామచంద్రారెడ్డి, ఎంపీడీవో విష్ణుచిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణ శేషుడిపై వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 11: కాణిపాక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం వరసిద్ధుడు స్వర్ణ శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, కాణిపాకం,వడ్రాంపల్లె, మిట్టఇండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాలకు చెందిన కమ్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాన్ని, ధ్వజ స్తంభాన్ని, సుపథ మండపాన్ని వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాన్ని నిర్వహించాక భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు చిన్నశేష వాహనంపై పురవీధులలో ఊరేగారు. రాత్రి ఉభయ వరస రావడంతో కల్యాణ వేదిక వద్ద సిద్ధి,బుద్ధి సమేత గణపతి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. స్వర్ణ పెద్దశేష వాహనంపై ఉత్సవర్లను కాణిపాకంలో ఊరేగించారు. శేష వాహనం సందర్భంగా బుధవారం మణికంఠేశ్వర స్వామి ఆలయం నుంచి ఉభయదారులు పాలు కలిగిన కలశాలను తలపై పెట్టుకుని మాడ వీధుల గుండా ఊరేగింపుగా ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. ఈ ఊరేగింపులో కేరళ వాయిద్యాలు, బాజాభజంత్రీలు, కోలాటాలు ఆకర్షణగా నిలిచాయి. అనంతరం కల్యాణ వేదికపై సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లకు అభిషేకం.. ఆ తర్వాత పుష్పయాగం నిర్వహించారు.

కాణిపాకంలో నేడు

గురువారం ఉదయం చిలక వాహనం, రాత్రి వృషభ వాహన సేవను నిర్వహించనున్నారు. ఉదయం సేవకు కాణిపాకానికి చెందిన ఆర్యవైశ్యులు.. రాత్రి వాహన సేవకు కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరుకు చెందిన శాలివాహన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.



టీటీడీలో ఇద్దరు అధికారుల డెప్యుటేషన్ పొడిగింపు

తిరుపతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఇద్దరు అధికారుల డెప్యుటేషన్ గడువును ప్రభుత్వం పొడిగించింది.రాష్ట్ర సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్ ఎ.విజయలక్ష్మి మూడేళ్ళుగా డెప్యుటేషన్‌పై టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్‌లో ప్రాజెక్టు ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. ఈమె డెప్యుటేషన్ గడువు వచ్చే నెల 7వ తేదీకి ముగియనున్న నేపథ్యంలో మరో ఏడాది పాటు ఆమె డెప్యుటేషన్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.అలాగే డివిజన్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో) ఎ.ప్రశాంతి కూడా డెప్యుటేషన్‌పై టీటీడీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా గత మూడేళ్ళ నుంచీ కొనసాగుతున్నారు. ఆమె డెప్యుటేషన్ గడువు వచ్చే నెల 24వ తేదీకి ముగియనుండడంతో ప్రభుత్వం మరో ఏడాది పాటు డెప్యుటేషన్ పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

సంప్రదాయబద్ధంగా తొలి చాటింపు



వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 11: పోలేరమ్మ జాతరకు తొలి చాటింపు బుధవారం అర్ధరాత్రి సంప్రదాయబద్ధంగా జరిగింది. పట్టణంలోని గాలిగంగు దేవస్థానం వద్ద జాతర నిర్వాహకులు, దేవదాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం ఆసాదుల తప్పెట్ల మోతలు, కేరింతల మధ్య ఈ నెల 25, 26 తేదీల్లో పోలేరమ్మ జాతర జరుగుతుందహో అంటూ స్థానికులు నందడి చేశారు. రాజా వీధిలోని పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలేరమ్మ దేవస్థానం ఈవో శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర నిర్వహణకు అనుమతి



ఈవోకు తాంబూలం ఇస్తున్న సాయికృష్ణ యాచేంద్ర

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 11: పోలేరమ్మ జాతరను సంప్రదాయాలను అనుసరిస్తూ నిర్వహించాలని వెంకటగిరి రాజా కుటుంబీకులు వి.బి.సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞ యాచేంద్ర అన్నారు. బుధవారం కోటలోని బొడ్డుసైగా మండపంలో పోలేరమ్మ ఆలయ ఈవో ఎ.శ్రీనివాసులు రెడ్డికి ఆనవాయితీ ప్రకారం జాతర నిర్వహణకు తాంబూలం అందించారు. టీడీపీ నాయకులు బి.రాజేశ్వరరావు, పి.విశ్వనాథం, సుబ్రమణ్యం, రమేష్, డిల్లీబాబు, సీఐ ఏ.వీ.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పొర్లుకట్టల పనులు త్వరితగతిన చేపట్టండి



అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

వాకాడు, సెప్టెంబరు 11 : గత ఏడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్‌తో కురిసిన భారీ వర్షానికి స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహించి బాలిరెడ్డిపాళెం వద్ద పొర్లుకట్టలతోపాటు వంతెన దెబ్బతింది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జల వనరుల శాఖ అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన వంతెన, పొర్లుకట్టలను బుధవారం పరిశీలించారు. బాలిరెడ్డిపాళెం ప్రజలతో మాట్లాడిన సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం టెండర్లు పూర్తి అయినప్పటికీ పనులు ప్రారంభించక పోవడంపై డీఈ సుబ్బారావును కారణాలను అడిగి తెలుసుకున్నారు. మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని డీఈ తెలిపారు. వర్షాలు ప్రారంభం అయ్యేలోగా పనులు పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో జల వనరుల శాఖ ఏఈ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడే జవాన్లకు జోహార్లు: విజయశ్రీ



జవాన్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, సెప్టెంబరు 11: దేశాన్ని అనునిత్యం కనురెప్పల్లా కాపాడే జవాన్లకు జోహార్లు అని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. లడక్ నుంచి జూలై 18న కన్యాకుమారి వరకు 50 మంది జవాన్లతో ప్రారంభమైన సైకిల్‌యాత్ర మంగళవారం రాత్రి స్థానిక జడ్పీ బాలుర పాఠశాలకు చేరుకుంది. వారికి అన్ని అవసరమైన సదుపాయాలను సమకూర్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బుధవారం జవాన్లను ఎమ్మెల్యే అభినందించారు. శాంతి, ఐక్యత కోసం జావాన్లు సైకిల్‌యాత్ర నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎంఈవో మునిరత్నం, టీడీపీ నాయకులు టి.సుధాకర్‌రెడ్డి, ఎం.రాజశేఖర్, ఏ.సుధీర్, గంగాప్రసాద్, మస్తాన్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన వీఏవో పంచాయతీ

- కోర్టు ఉత్తర్వులను లెక్కచేయని వెలుగు అధికారులు

బాలాయపల్లి, సెప్టెంబరు 11: మండలంలోని మన్నూరుకు చెందిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ పంచాయతీ బుధవారం పోలీసుస్టేషన్‌కు చేరింది. మన్నూరుకు చెందిన జి. మాధవి ఐదేళ్లుగా వీఏవోగా విధులు నిర్వహిస్తోంది. అదే గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన చోటా నాయకుడు ఆమెను తొలగించేందుకు యత్నించడంతో హైకోర్టును ఆశ్రయించింది. దీంతో న్యాయస్థానం గ్రామ సంఘ తీర్మానం ప్రకారం కొనసాగించాలని వీఏవో విధుల్లో జోక్యం చేసుకోరాదంటూ తీర్పు వెలువరించింది. అయితే వెలుగు సీసీ ఇందిర నాయకులతో కుమ్మక్కై వీఏవోను విధులకు హాజరు కావద్దంటూ సంబంధిత పుస్తకాలను ఇవ్వాలని గ్రామ సంఘం అధ్యక్షురాలి ద్వారా ఒత్తిడి చేసింది. రెండు రోజుల క్రితం తీర్మాన పుస్తకం ఇచ్చింది. గ్రామ సంఘ తీర్మాన పుస్తకం తీసుకెళ్లిన అధ్యక్షురాలు వీఏవో మాధవికి గ్రామ సంఘ తీర్మానం లేదంటూ ఫోన్ చేసింది. అలాగే మిగిలిన పుస్తకాలు ఇవ్వాలని బుధవారం వీఏవో ఇంటివద్దకు కొందరిని తీసుకెళ్లి అడగంతో వివాదం నెలకొంది. దీంతో పుస్తకాలు ఇవ్వలేదని అధ్యక్షురాలు వీఏవోపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే తన ఇంటిమీదకు వచ్చి దౌర్జన్యం చేసి దుర్భాషలాడారని వీఏవో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వర్క్ ఆర్డర్ లేకుండా బిల్లులు ఎలా ఇస్తారు?

కోట, సెప్టెంబరు 11: కోట పట్టణంలో తనకు తెలియకుండా రోడ్డు నిర్మించడమే కాకుండా దానికి సంబంధించిన బిల్లు రూ.36 లక్షలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవడం ఇది ఎంత వరకు సబబు అని ఎంపీటీసీ సభ్యుడు షేక్ షంషుద్దీన్ ప్రశ్నించారు. ఈమేరకు బిల్లు చెల్లింపులపై ఎంపీడీవో భవానికి ఫిర్యాదు చేశారు. తమ పరిధిలో పనికి తమకు సమాచారం ఇవ్వకుండా, ఆ పనులకు సంబంధించి వర్క్‌ఆర్డర్లు లేకుండా బిల్లులు ఎలా చెల్లిస్తారన్నారు. దీనిపై మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తానని షంషుద్దీన్ హెచ్చరించారు.

మట్టి అక్రమ తవ్వకాలపై దాడులు



ట్రాక్టర్‌ను సీజ్ చేస్తున్న వీఆర్వో

పెళ్లకూరు సెప్టెంబరు 11: ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్‌ను బుధవారం తెల్లవారు జామున వీఆర్వో కల్యాణి పట్టుకున్నారు. మండలంలోని ముమ్మారెడ్డిగుంట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వీఆర్వో దాడులు చేశారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ ద్వారకానాథ రెడ్డి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి జరిమానా విధించి వాహనాలను వదిలేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

ముగిసిన వేనాడు దర్గా గంధోత్సవం





గంధాన్ని ఊరేగిస్తున్న గ్రామ పెద్ద సుదర్శన్ మొదలి - బాబా సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు - బాబాకు సారె తీసుకువచ్చిన మహిళలు

తడ, సెప్టెంబరు 11: మండలంలోని వేనాడులో ఉన్న షేక్ దావూద్‌షా వలీ అల్లా తాత దర్గా 29వ గంధోత్సవం బుధవారం తెల్లవారు జామున ముగిసింది. మంగళవారం ఉదయం ఘనంగా ప్రారంభమైన కార్యక్రమం అర్ధరాత్రి తరువాత మత పెద్దలు, గ్రామపెద్దల సమక్షంలో గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువచ్చారు. గ్రామపెద్ద సుదర్శన్ మొదలి ఆ గంధాన్ని బాబా సమాధికి లేపనం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అలా లేపనం చేసిన గంధాన్ని తరువాత భక్తులకు పంచిపెట్టారు. ఈక్రమంలో గ్రామంలోని హిందూ మహిళలు సంప్రదాయబద్ధంగా సారెను తీసుకు వచ్చి ఆనవాయితీ మేరకు బాబాకు సమర్పించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి గంధో త్సవాన్ని ముగించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు దర్గా వద్దకు చేరుకోగా వారికి దర్గా నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. ప్రత్యేక ప్రార్థలు, పూజల్లో పాల్గొన్న అనంతరం మత పెద్దలు ఆశీర్వచనం ఇప్పించారు. ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నాయకులు టి.సుధాకర్‌రెడ్డి, బి.శ్రీధర్, సెల్వం, నీలకంఠం, బి.పళణి, టీకే శ్రీనివాసన్, మాధవనాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమలు





గూడూరు, విద్యానగర్‌లనుంచి నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు - తూపిలిపాళెం తీరానికి చేరుకున్న భారీ వినాయక ప్రతిమ

కోట, సెప్టెంబరు 11 : మండలంలోని పలు గ్రామాల్లో గణేశ నిమజ్జనాలు జరిగాయి. కోట, గూడలి, తిన్నెలపూడి, ప్రకాశం కాలనీ, విద్యానగర్‌లలో నిమజ్జనానికి ముందు ప్రతిమల గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో యువత కేరింతలు కొడుతూ శ్రీనివాసనత్రం సముద్రతీరంలో నిమజ్జనం చేశారు. తహసీల్దారు జయజయరావు, పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు, వీఆర్వో శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

గూడూరు అర్బన్: పట్టణంలోని పలు కూడళ్లలో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను బుధవారం నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రతిమలకు పూజలు నిర్వహించి, వాహనాలపై ఉంచి, పట్టణంలో ఊరేగించారు. పంబలేరు, తూపిలిపాళెంలలో నిమజ్జనం చేసేందుకు తరలివెళ్లారు.

వాకాడు : భక్తి శ్రద్ధలతో వైభవంగా 5 రోజులు పూజలు అందుకున్న గణపయ్యలు నిమజ్జనానికి చేరడంతో తూపిలిపాళెం సముద్రతీరం బుధవారం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ నాగబాబు మాట్లాడుతూ తూపిలిపాళెం సముద్రతీరానికి 450కి పైగా వినాయక ప్రతిమలు నిమజ్జనానికి భక్తులు తీసుకువచ్చారన్నారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలో గణేశ్ నిమజ్జన వేడుకలను పలు ప్రాంతాల్లో బుధవారం కోలాహలంగా జరిగాయి. వినాయకచవితి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన గణేశ్ ప్రతిమలను ఐదో రోజు నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా బాపూజీ వీధి, గాండ్లవీధిలో కొలువు దీర్చిన వినాయక మండపాల వద్ద కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. గణపయ్య ప్రతిమ లను మంగళమేళాలు, కేరళ బ్యాండ్ మేళాలలతో పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి కాళంగి నదిలో నిమజ్జనం చేశారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఓజిలి: మండలంలో వినాయక ప్రతిమలను యువకులు నిమజ్జనానికి తరలిస్తున్నారు. ఈ నెల 7వ తేదీన వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతిమలను క్రమంగా తరలిస్తున్నారు. ఓజిలి, చిలమానుచేను, వెంకటరెడ్డిపాలెం, పెద్దపరియ, ఆరిమేనిపాడు తదితర గ్రామాల్లో యువకులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. జై బోలో గణేష్ మహరాజ్‌కి జై.. అంటూ కేరింతలతో గణనాథులకు వీడ్కోలు పలుకుతున్నారు.

కొనసాగిన చవితి వేడుకలు

నాయుడుపేట టౌన్: చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం 5వ రోజు పట్టణంలోని కూడలి ప్రాంతాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో వినాయక ప్రతిమల పందిళ్ల వద్ద అన్నదానాలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా యువత రంగులు చల్లుకుంటూ, డీజే వాయిద్యాల నడుమ నృత్యాలతో ఆనందోత్సాహాలతో తరలించారు. రాజకృష్ణాపురంలోని వినాయక ప్రతిమల వద్ద చవితి లడ్డూను రూ.1.15 లక్షలకు వేలంలో జగదీష్ దక్కించుకోగా, 5 రూపాయల మాలను రూ.20వేలకు నాగేంద్ర దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో జి. మధుసూదన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నిర్వాహకులు వెంకటాద్రి, బృందం తదితరులు పాల్గొన్నారు.



వేలంలో లడ్డూ దక్కించుకున్న జగదీష్

చిల్లకూరు: మండలంలోని పలు వినాయక ప్రతిమల వద్ద బుధవారం ఐదో రోజు అన్నదానాలు, ఉట్టి కార్యక్రమాలు నిర్వహిం చారు. వినాయక ప్రతిమలకు పూజలు నిర్వహించి లడ్డూలను వేలం వేశారు. తప్పెట్లు, తీన్‌మార్ వాయిద్యాల నడుమ వినాయక ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు.

దక్కిలి: మండలంలోని పలు గ్రామాల్లో చవితి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకొంటున్నారు. కమ్మపల్లి రోడ్డు సెంటరులో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్కిలి ఎంఈవో పి.జగదీష్ బాబు దంపతులు ఉభయదాతలుగా అన్నదానం చేశారు. కాగా ప్రతిమలను తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేయరాదని పోలీసులు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లోని చెరువులు, కాలువుల్లో చేయాలన్నారు.



విజయవాడ బాధితులను ఆదుకుందాం



ఎమ్మెల్యేకు చెక్కులు అందిస్తున్న నాయకులు

గూడూరు, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు గూడూరు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు ముందుకు వచ్చి విరాళాలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం విజయవాడలో వాకాడు మండలం టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు వరదబాధితుల సంక్షేమానికి రూ.2లక్షల చెక్కును మధుసూదన్‌రెడ్డి, హరీష్‌బాబ అందజేశారు. ఆ నగదుతో 43వ డివిజన్‌లోని బాధితులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే బాధితులకు నిత్యావసరాలను, దుప్పట్లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్వోత్తమరెడ్డి, నటశేఖర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోండి



ప్రసంగిస్తున్న యుగంధర్

గూడూరు, సెప్టెంబరు 11: స్వామి వివేకానందను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యకారిణి సభ్యుడు యుగంధర్ అన్నారు. బుధవారం ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వివేకానందపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివేకానంద 1893వ సంవత్సరంలో సెప్టెంబరు 11న షికాగోలో జరిగిన విశ్వమత మహాసభలో ప్రసంగించిన రోజు సందర్భంగా ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచానికి నాగరికతను నేర్పింది వివేకా నందుడే అన్నారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన వందమంది యువతను ఇస్తే ఈ దేశాన్ని మారుస్తానని ఆయన చెప్పిన బోధనలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చిన్నతనం నుంచే దైవభక్తి, దేశభక్తితో కూడిన ఆయన జీవితం ఎందరికో ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశభవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, మూర్తి, మహేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న మట్టం శ్రావణి

గూడూరు, సెప్టెంబరు 11: విద్యార్థిని ఉన్నత చదువులకు ఆర్థికసాయం అందజేసినట్లు తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి చెప్పారు. చెన్నూరు గ్రామానికి చెందిన శ్రావణి గూడూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంసీఏ చదువుతోంది. ఆమె చదువులకు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆర్థికసాయం చేస్తామని గతంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు శ్రావణి ఎంసీఏ మొదటి సంవత్సరానికి సంబంధించిన ఫీజు రూ.25వేలను ఎమ్మెల్యే అందజేయడంతో ఆ నగదును పంపిణీ చేసినట్టు శ్రావణి తెలిపారు.

విద్యార్థినికి నగదు అందజేత

గూడూరు పట్టణంలోని త్యాగరాజవీధిలో ఉన్న ఫంక్షన్ హాలులో బుధవారం బలిజ సంఘం ఆధ్వర్యంలో బలిజ విద్యాదీవెన కార్యక్రమం ద్వారా ఓ విద్యార్థినికి ప్రతిభా ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. పట్టణానికి చెందిన సుప్రజ చదువులలో ప్రతిభ చూపడంతో సంఘం ఆధ్వర్యంలో రూ.5వేలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వి. రమణయ్య, ఎస్.శ్రీనివాసులు, ఎం.నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన మాజీ ఎంపీ

గూడూరు, సెప్టెంబరు 11: టీడీపీ భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాస్‌ను బుధవారం విశాఖపట్నంలోని ఆయన నివాసంలో కలిసినట్లు మాజీ ఎంపీ వరప్రసాద్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసివున్న గణేష్‌ప్రతిమ నిమజ్జన కార్యక్రమానికి ఆహ్వానించడంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు మాజీ ఎంపీ తెలిపారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం



గూడూరు అర్బన్, సెప్టెంబరు 11: స్థానిక చల్లకాలువ సమీపంలోని పొలాల్లో గుర్తు తెలియని యువకుడు మృతి చెంది పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. 25ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని యువకుడి మృతదేహంపై నీలి రంగు జీన్స్ ప్యాంట్, బ్లూ కలర్ చొక్కా వున్నాయన్నారు. తల, శరీరంపై గాయాలున్నట్లు గుర్తించామన్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్టు రూరల్ సీఐ కిషోర్‌బాబు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

కాపాలదారు మృతదేహానికి నేడు పోస్టుమార్టం

చిల్లకూరు, సెప్టెంబరు 11: మండలంలోని తొణుకుమాల గ్రామ సమీపంలోని పొలాల్లో మృతదేహన్ని పూడ్చడంపై కలకలం రేగిన విషయం విదితమే. ఓ తోటలో కాపలాగా ఉండే వెంకటేశ్వర్లు అదే తోటలో ఉండే కాపలాగా ఉన్న మరో వ్యక్తి అంకయ్యను కొట్టి చంపి పూడ్చివేసినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. ఈ క్రమంలో తోట యజమానురాలి ఫిర్యాదు మేరకు ఈనెల 12న గురువారం రెవెన్యూశాఖ అధికారులు, వైద్యుల సమక్షంలో గుంటను తవ్వి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌ల ఢీ: ఒకరి మృతి



తడ, సెప్టెంబరు 11: రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. తడకు చెందిన ఎ.విష్ణు(26) బుధవారం మధ్యాహ్నం సొంత పనిమీద బైక్‌పై బోడిలింగాలపాడులోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బోడిలింగాలపాడు జాతీయ రహదారి మలుపువద్ద సూళ్లూరుపేట నుంచి తడకు వస్తున్న బైక్ వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విష్ణుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే అతను మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పని సరి

మహిళలకు ఎమ్మెల్యే విజయశ్రీ సూచన



స్క్రీనింగ్ టెస్టు వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

దొరవారి సత్రం, సెప్టెంబరు 11: మహిళలు తప్ప నిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ సూచించారు. తిరుపతి స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో దొరవారిసత్రం మండలం తనియాలిలో పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఎమ్మెల్యే వైద్యురాలు కావడంతో బస్సుల్లో పరీక్షలకు సంబంధించిన ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 35 ఏళ్లు నిండిన ప్రతి మహిళా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుబ్రమణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్. విజయభాస్కర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, వైద్యాధికారులు చైతన్య, పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి పెద్ద పీట



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కాపు సంఘం నాయకులు

వెంకటగిరి, సెప్టెంబరు 11: కాపుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శ్రీకృష్ణ దేవరాయ బలిజ సంఘ అధ్యక్షుడిగా మణి ఎకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సంఘ నాయకులు ఎమ్మెల్యేని బుధవారం మర్యాదకపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ... సంఘాలు పేదల సంక్షేమానికి తోడ్పా టునందించే విధంగా పనిచేస్తే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. పేదల సమస్యలు సంఘ సభ్యులు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామనన్నారు. ఈ కార్యక్రమంలో జి.మనోజ్ కుమార్, రాము, ఎల్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ విధానంలోనే లావాదేవీలు



మహాజన సభలో ప్రసంగిస్తున్న రవి రాజశేఖర్

చిల్లకూరు, సెప్టెంబరు 11: సహకార సంఘ లావాదేవీలను ఇకపై ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తా మని డివిజన్ సహ కారశాఖ అధికారి రవి రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని తిప్పగుంటపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం సహకార సంఘాలను కంప్యూటరీకరణకు చర్యలు చేపట్టిందన్నారు. సంఘ సభ్యులు వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించు కోవాలన్నారు. సుమారు ఈ సంఘంలో 1000 మంది వరకు ఉన్నారని ఇప్పటికి 600 మంది మాత్రమే వివరాలను అందించారన్నారు. సీఈవో ఆర్. రామానాయుడు, విద్యాసాగర్, ఇలియాజ్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, శ్రీనివాసులురెడ్డి, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సాధించుకుందాం

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుల పిలుపు



నిరాహారదీక్ష చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

కోట, సెప్టెంబరు 11: అన్నదమ్ములులాంటి ఎస్సీలు వర్గీకరణ పేరుతో విడిపోకుండా ఉమ్మడి ఉద్యమం చేసి హక్కులను సాధించుకుందామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. కోట పట్టణంలో బుధవారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల మాలల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ముందుగా ఆయా నాయకులంతా ఆర్టీసీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడినుంచి ఎస్సీ వర్గీకరణ వద్దు.. రాజ్యాధికారమే ముద్దు అంటూ బజారుసెంటర్ మీదుగా కోట క్రాస్‌రోడ్డుకు చేరుకున్నారు. అక్కడ మానవహారం నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓట్ల కోసం చేసే ఈ మాయాజాలంలో బలిపశువులు కావద్దన్నారు. ఎం.మాధవ్, పి.వసంత్ కుమార్, అశోక్‌కాంబ్లే, డి.సుందరం తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ చాంపియన్‌షిప్ విజేతలకు అభినందన

కోట, సెప్టెంబరు 11: మండలంలోని చిట్టేడు ఎన్‌సీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జూనియర్ జిల్లా అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలకు అభినందన సభ జరిగింది. ఈనెల 9న నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జూనియర్ జిల్లా అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎన్‌సీఆర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అండర్ 14 బాలికల విభాగం లాంగ్‌జంప్‌లో రోహిత ప్రథమస్థానం, అండర్ 14 బాలుర విభాగం లాంగ్‌జంప్‌లో విష్ణువర్ధన్ ద్వితీయస్థానం, అండర్ 16 బాలికల విభాగంలో దీపిక లాంగ్‌జంప్‌లో ద్వితీయస్థానం, జావెలిన్ త్రోలో ప్రథమస్థానం, సీహెచ్ చెంచువందన లాంగ్‌జంప్‌లో తృతీయస్థానం, జావెలిన్ త్రోలో ద్వితీయస్థానం సాధించారు. దీంతో విజేతలను హెచ్‌ఎం నిర్మలాదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వాకాడు, సెప్టెంబరు 11 : గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి అన్నారు. మండలంలోని బాలిరెడ్డిపాళెం, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 11: పట్టణంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ మధులేటి సిబ్బందితో కలిసి బుధవారం పలు దుకాణాల్లో దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దుకాణదారులు కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయించరాదని, ఫుడ్ లైసెన్సు తప్పని సరిగా ఉండాలన్నారు. ఆహార పదార్థాల విక్రయాల్లో నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా పలు దుకాణాలను పరిశీలించారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

ఓజిలి సెప్టెంబరు 11 : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో రజనీకాంత్ అన్నారు. ఓజిలిలో బుధవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు తమ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యం పనులు చేయించాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా బ్లీచింగ్, క్లోరినేషన్ వంటి చర్యలు కూడా తీసుకునేలా వైద్య సిబ్బందితో కలసి పనిచేయాలని అన్నారు.